తిరునల్వేలి కోర్టు ప్రాంగణంలో

యువకుడి దారుణహత్య

● ఆరుగురి అరెస్టు


నిందితుడు రామకృష్ణన్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు, హంతకులు ఉపయోగించిన కారు, మృతుడు మాయాండి (ఫైల్‌ఫొటో)

చెన్నై, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఉదయం ఓ హత్యకేసులో విచారణకు వచ్చిన యువకుడిని కారులో వచ్చిన ఆరుగురు దుండగులు వేటకొడవళ్లు, కత్తులతో దాడి చేసి పోలీసులు, న్యాయవాదులు చూస్తుండగానే దారుణంగా హతమార్చారు. హంతకుల్లో ఒకడిని న్యాయవాదులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ హత్య జరిగే సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ న్యాయవాదులు కోర్టు ఎదుట ధర్నాకు దిగటంతో ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. తిరునల్వేలి జిల్లా పాళయంకోట కీళ్‌నత్తం మేలూరు ప్రాంతానికి మాయాండి అలియాస్ పల్లు మాయాండి (28) పాల వ్యాపారం, పందిరి అలంకరణ పనులు చేస్తున్నా డు. అతడిపై హత్య, హత్యాయత్నం, దారిదోపిడీ కేసులు చుట్టుపక్కలి పోలీసుస్టేషన్లలో నమోదై ఉన్నాయి. శుక్రవారం ఉదయం ఓ హత్య కేసులో విచారణకు హాజరయ్యేందుకు మాయాండి తన తమ్ముడు మారిసెల్వంతో బైకులో తిరునల్వేలి జిల్లా కోర్టుకు బయలుదేరారు. కేటీసీ నగర్- తిరుచెందూరు రోడ్డులో ఉన్న కోర్టుకు సమీపిస్తుండగా కేరళ రిజిస్ట్రేషన్ కారులో అక్కడికి చేరుకున్న గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు కారులోంచి దిగి వేటకొడవళ్లు, కత్తులు పట్టుకుని మాయాండి వైపు దూసుకొచ్చారు. వారిని చూడగానే మాయాండి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఆలోగా కారులోంచి దిగిన మరో నలుగురు వెంటబడ్డారు. దీంతో ప్రాణభయంతో మాయండి కోర్టు ప్రాంగణంలోకి పరుగెత్తాడు. అయినా ఆ ఆరుగురు దుండగులు చుట్టుముట్టి వేటకొడవళ్లు, కత్తులతో అతడి చేతులు కాళ్లను నరికి పారిపోయారు. ఈ సంఘటనను చూసి దిగ్భ్రాంతికి గురైన న్యాయవాదులు కొందరు పారిపోతున్న దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నించి ఒకడిని నిర్బంధించారు. తక్కిన ఐదుగురు కారులో మాయమయ్యారు. ఈ సంఘటనలో వంటినిండా కత్తిపోట్లతో తల చితికి మాయాండి మరణించాడు. ఈ సమాచారం తెలుసుకున్న తిరునల్వేలి పోలీసు కమిషనర్ రూపేశ్ కుమార్ మీనా, ఈస్ట్‌జోన్ డిప్యూటీ కమిషనర్ విజయకుమార్, పాళయంకోట సీఐ థిల్లై నాగరాజన్ సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. వేలిముద్రల నిపుణులను రప్పించి హంతకుల వేలి ముద్రలను సేకరించారు. డాగ్ స్క్వాడ్‌ను కూడా తెప్పించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో గత యేడాది ఆగస్టులో జరిగిన కీళ్‌నత్తం పంచాయతీకి చెందిన రాజామణి (33) అనే వార్డు సభ్యుడి హత్యకేసులో మాయాండి ప్రధాన నిందితుడని, కక్ష సాధింపులో ఈ హత్య జరిగినట్లు తెలుసుకున్నారు. లాయర్లు పట్టుకున్న హంతకుల్లో ఒకడైన కీళ్‌నత్తం ఇందిరా కాలనీకి చెందిన రామకృష్ణన్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ జరిపారు. ఇదిలా ఉండగా జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ హత్య జరుగుతున్న సమయంలో సుమారు 50 మందికి వరకు పోలీసులున్నా హత్యను అడ్డుకునేందుకు, హత్య తర్వాత పారిపోతున్నా వారిని పట్టుకునేందుకు ప్రయత్నించకుండా ప్రేక్షక పాత్రను వహించడాన్ని ఖండిస్తూ న్యాయవాదులంతా ధర్నా, రాస్తారోకోకు దిగారు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని హంతకులను పట్టుకునేందు కు చర్యలు చేపడతామని, ఇకపై కోర్టు ప్రాంగణంలో ఇలాంటి సంఘటనలు జరుగకుండా పటిష్టమైన భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో న్యాయవాదులంతా ఆందోళన విరమించుకున్నారు. ఆ తరువాత కోర్టు పరిసరాల్లో దుకాణాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించగా హంతకులు కేరళ రిజిస్ట్రేషన్ కలిగిన కారులో పారిపోవటం గమనించారు. ఆ నెంబర్ ఆధారంగా పోలీసులు చుట్టుపక్కల పోలీసుస్టేషన్లను అప్రమత్తం చేశారు. చివరకు తిరునల్వేలి శివారులో కారులో పారిపోతున్న సురేష్, మనోజ్, మహేష్, మనోరాజ్ అనే ఐదుగురిని అరెస్టు చేసి, హత్యకు ఉపయోగించిన కారును కూడా స్వాధీనం చేసుకున్నారు.

నివేదిక కోరిన హైకోర్టు...

ఇదిలా ఉండగా పోలీసుల బందోబస్తు ఉండే తిరునల్వేలి జిల్లా కోర్టు ప్రాంగణంలో ఓ నిందితుడిని దుండగులు హతమార్చటంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ హత్యా సంఘటన గురించి ప్రసారమాధ్యమాల ద్వారా వివరాలు తెలుసుకున్న హైకోర్టు స్యూమోటో కేసు నమోదు చేసింది. పట్టపగలు జిల్లా కోర్టుకు వంద మీటర్ల దూరంలో యువకుడిని హత్య చేస్తుంటే పోలీసులు ఎలా ప్రేక్షక పాత్ర పోషిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ హత్యా సంఘటనపై సమగ్రమైన నివేదికను సమర్పించమంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.


మృతదేహం వద్ద విలపిస్తున్న మాయాండి తమ్ముడు మారిసెల్వం

ప్రజాదరణ చూసి ఓర్వలేక

మాపై విమర్శలా?

● దమ్ముంటే కేంద్రంపై మీ సత్తా ప్రదర్శించండి ● ఈరోడ్ సభలో ఈపీఎస్‌పై సీఎం స్టాలిన్ ధ్వజం



ఈరోడ్ సభలో ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద ఓ లబ్దిదారుకు సహాయాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల ద్రావిడ తరహా పాలన చూసి అన్ని వర్గాలవారు మెచ్చుకుంటున్నారని, రోజురోజుకూ పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి పసలేని విమర్శలు చేస్తున్నారని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు ఈరోడ్ నగరంలో శుక్రవారం జరిగిన సభలో ఆ జిల్లాలో రూ.951.20 కోట్లతో పూర్తయిన 559 పథకాలను ప్రారంభించి, రూ. 133,66 కోట్ల తో చేపట్టనున్న 222 పథకాలకు సీఎం శంకుస్థాపన చేశారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.284.02 కోట్ల విలువైన సహాయాలను అందజేశారు. ఈ సందర్భంగా సభలో స్టాలిన్ మాట్లాడుతూ ద్రవిడ ఉద్యమనేత పెరియార్ జన్మస్థలమైన ఈరోడ్ సభలో పాల్గొనటం తనకెంతో ఆనందంగా ఉందని, తమిళ ప్రజలకు అన్నాదురై, కరుణానిధి వంటి రాజకీయ ప్రముఖులను పరిచయం చేసిన ఘనత పెరియార్‌కే దక్కుతుందన్నారు. పెరియార్ సీమలో జరిగిన సభలో పాల్గొంటున్నాననే సంతోషం కంటే, ఈరోడ్ శాసనసభ్యుడు, తన ఆత్మీయ మిత్రుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ ఈ సభలో లేకపోవడం తనకు శోకాన్ని కూడా కలిగిస్తోందన్నారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో జరిగినట్లు పథకాలను ప్రకటించి ఊరుకోవడం లేదని, శాసనసభ లోపలా, బయటా తాను ప్రకటించే ప్రతి పథకమూ సక్రమంగా అమలవుతున్నాయా? ఆ పథకాల ఫలితాలు మారుమూల గ్రామాలలోని నిరుపేదలకు అందుతున్నాయనా? అని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలను వరుసగా నెరవేరుస్తుండటాన్ని చూసి ఓర్వలేకే ఈపీఎస్ అసత్య ఆరోపణలతో తమ పాలనపై విమర్శలు చేస్తున్నారని స్టాలిన్ ధ్వజమెత్తారు. ఇటీవలి తుపాను వర్షాలు, అల్పపీడన ప్రభావిత వర్షాల సమయంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడం వల్లే వరదలు బాగా తగ్గాయని, ప్రాణనష్టాన్ని నిరోధించగలిగామని, సాత్తనూరు డ్యామ్‌లో అదనపు జలాలను విడుదల చేయడానికి ముందు నాలుగైదుసార్లు హెచ్చరికలు చేసిన మీదటే విడుదల చేశామని, ఇవేవీ ఈపీఎస్ కళ్ళకు కనబడలేదన్నారు. అన్నాడీఎంకే పాలనలో చెంబరంబాక్కం జలాల విడుదల వల్ల నగరంలో ఏర్పడిన వరద పరిస్థితులను, తాము పడ్డ కష్టాలను నగరవాసులు ఎప్పటికీ మరువలేరనే సంగతి ఈపీఎస్‌కు తెలియకపోవడం గర్హనీయమన్నారు. ప్రతిరోజూ బాధ్యతాయుతమైన ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నాననే విషయాన్ని కూడా మరచిపోయిన ఈపీఎస్ తమిళ హాస్యనటుడు సెంథిల్, గౌండమణి అరటిపండు కామెడీలాగా పసలేని ఆరోపణలు చేస్తూ అభాసుపాలవుతున్నారని స్టాలిన్ ఎద్దేవా చేశారు. ఎంతసేపూ డీఎంకే పాలనపైనే గగ్గోలు పెడుతున్న ఈపీఎస్ రాష్ట్రాభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోకుండా, నిధులు విడుదల చేయకుండా నిరంకుశ ధోరణిని ప్రదర్శిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై అరచి గగ్గోలు పెడితే రాష్ట్రానికి కాస్త ప్రయోజనం కలుగుతుందని స్టాలిన్ సూచించారు. రాజ్యసభలోని అన్నాడీఎంకే సభ్యులను ఆ దిశగా కేంద్రంపై ఒత్తిడి చేసి రాష్ట్రానికి ఆర్థిక పరమైన ప్రయోజనాలు కలిగేలా ఈపీఎస్ చర్యలు తీసుకోవాలని స్టాలిన్ హితవు పాలికారు.

ఈరోడ్‌కు వరాల జల్లు...

ఈరోడ్‌జిల్లాను మరింతగా అభివృద్ధిపరిచేలా ముఖ్యమంత్రి స్టాలిన్ సభాముఖంగా ఎనిమిది వరాలను ప్రకటించారు. ఈ ప్రకారం ఈరోడ్ కార్పొరేషన్, అందియూరు, గోపిచెట్టిపాళయం, మొడకురిచ్చి, పెరుందురై ప్రాంతాల్లోని రహదారులను మెరుగుపరిచేందుకు, మరమ్మతుచేయడానికి రూ.100 కోట్ల మేర కేటాయించనున్నట్లు ప్రకటించారు. ఈ రోడ్ నగరంలో డీఎస్పీ కార్యాలయం వద్ద రూ.15.37 కోట్లతో కొత్త భవనాన్ని అగ్నిమాపక దళం కార్యాలయం కోసం రూ.8.03 కోట్ల వ్యయంతో కొత్త భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈరోడ్ జిల్లాలో అద్దెభవనాలలో నడుపుతున్న 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.6.75 కోట్లతో సొంతభవనాలు నిర్మించనున్నామని, భవానీ వద్దనున్న సంగమేశ్వరాలయం, కొడుముడిలోని మకుటేశ్వర ఆలయం, వీరనారాయణ పెరుమాళ్ ఆలయ భక్తులకు విస్తృత సదుపాయాలు కల్పించేందుకు రూ.10 కోట్ల మేరకు నిధులు కేటాయించనున్నట్లు స్టాలిన్ ప్రకటించారు. కార్యక్రమంలో మంత్రులు కేఎస్ నెహ్రూ, ముత్తుసామి, సామినాధన్, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, కయల్‌విళి సెల్వరాజ్, మదివేందన్, పార్లమెంట్ సభ్యులు అంధియూరు సెల్వరాజ్, ప్రకాష్, సుబ్బరాయన్, శాసనసభ్యులు వెంకటాచలం, సరస్వతి, జిల్లా కలెక్టర్ రాజగోపాల్ సుంకర తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగురాలికి ట్రై స్కూటర్ అందించి ఆమెతో మాట్లాడుతున్న స్టాలిన్

బ్యాంకుల్లో 443 కేజీల బంగారం డిపాజిట్

● దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు


పళని ఆలయ ప్రాంగణంలో స్టేట్‌బ్యాంక్‌లో డిపాజిట్ చేయనున్న బంగారంతో మంత్రులు పీకే శేఖర్‌బాబు, ఆర్.చక్రపాణి తదితరులు

ప్యారీస్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆలయాలకు భక్తులు కానుకలగా ఇచ్చే బంగారాన్ని జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేసి, వచ్చే వడ్డీని ఆలయాల అభివృద్ధి పథకాలకు కేటాయిస్తున్నట్లు హిందూ దేవాదాయ శాఖా మంత్రి పీకే శేఖర్‌బాబు వెల్లడించారు. దిండుగల్ జిల్లా పళని దండాయుధపాణి ఆలయానికి భక్తులు కానుకగా సమర్పించిన రూ.136 కోట్ల విలువైన 192.984 కేజీల బంగారు నగలను కరిగించి, గోల్డ్ డిపాజిట్ పథకంలో డిజాజిట్ చేసేందుకు స్టేట్ బ్యాంక్ అధికారులకు అందించే కార్యక్రమం శుక్రవారం పళని దండాయుధపాణి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖా మంత్రి ఆర్.చక్రపాణి, పళని ఎమ్మెల్యే సెందిల్‌కుమార్, రిటైర్డ్ జడ్జి మాల తదితరులతో కలిసి మంత్రి పీకే శేఖర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో తొలి విడతగా 23 ఆలయాల్లో భక్తులు కానుకగా సమర్పించిన బంగారు నగలు కరిగించి 443 కిలోల బంగారాన్ని బ్యాంకులో డిపాజిట్ చేయడం వల్ల సంవత్సరానికి రూ. 5.79 కోట్లు వడ్డీ వస్తోందన్నారు. రెండో విడతగా పళని ఆలయంలో 192.984 కిలోగ్రాముల బంగారం, మాసాని అమ్మవారి ఆలయంలో 28 కిలోల బంగారం, తిరుచ్చి గుణశీలన్ ఆలయంలో 12 కిలోల బంగారాన్ని కరిగించి డిపాజిట్ చేసినట్లు తెలిపారు. భక్తులు ఆలయాలకు కానుకగా సమర్పిస్తున్న ఏనుగులను సక్రమంగా సంరక్షిస్తున్నామని, ప్రస్తుతం ఏనుగులు లేని ఆలయాలకు ఏనుగులను కానుకగా భక్తులు సమర్పించాలని మంత్రి కోరారు. పళని ఆలయాన్ని సందర్శించే భక్తుల సౌకర్యార్థం రెండో రోప్‌కారును మలేసియా, జపాన్ దేశాల్లో మాదిరిగా ఆధునికీకరణ విధానంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. ఈ ఆలయానికి ధర్మకర్తల మండలి సభ్యులను వచ్చే జనవరిలో నియమించనున్నట్లు మంత్రి శేఖర్‌బాబు తెలిపారు.

6 నుంచి అసెంబ్లీ సమావేశాలు

● సభలో గవర్నర్ ప్రకటనలకు తావులేదు ● స్పీకర్ అప్పావు



చెన్నై, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం శాసనసభ తొలి సమావేశాలు జనవరి ఆరు నుంచి ప్రారంభమవుతాయని స్పీకర్ అప్పావు ప్రకటించారు. తొలిరోజు గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రసంగంతో సభ ప్రారంభమవుతుందని, ఆ ప్రసంగం తమిళ అనువాదాన్ని తాను చదివిన తర్వాత సభ వాయిదా పడుతుందని, ఆపై సభావ్యవహార మండలి సమావేశమై ఎన్నిరోజులు శాసనసభ సమావేశాలు జరపాలనే విషయమై నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో శుక్రవారం మధ్యాహ్నం అప్పావు పాత్రికేయులతో మాట్లాడుతూ శాసనసభలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రసంగ పాఠాన్ని గవర్నర్ చదవటానికి మాత్రమే అనుమతి ఉంటుందని, ప్రభుత్వంపై విమర్శలు చేయటానికి, వ్యక్తిగత ప్రకటనలు చేయడానికి గానీ అనుమతి లేదని, ఈ విషయాన్ని గవర్నర్ గుర్తించాలన్నారు. శాసనసభలో ఎన్నికైన 234 మంది శాసనసభ్యులు మాత్రమే తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి అనుమతి ఉంటుందని, ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధి అని ఆయన వివరించారు. శాసనసభ సమావేశాలను యేడాదికి వందరోజులపాటు జరపాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ అభిమతమని, అయితే ఎన్నికలు, వరదలు, తుఫాన్ తదితర సమస్యల కారణంగా శాసనసభ సమావేశాలను ఎక్కువ రోజులు నడుపలేకపోతున్నామని స్పీకర్ ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభ సమావేశాలు కొద్ది రోజులపాటే జరిగినా ప్రధానమైన ప్రజా సమస్యలపై చర్చలకు అనుమతించమని, కీలకమైన ఆర్థిక పద్దులను ఆమోదింపజేశామని, ఆయా పరిస్థితులకు అనుగుణంగా సభను సమర్థవంతంగా జరుపుతున్నామని చెప్పారు. జనవరి 6తేదీ ఉదయం 9 గంటలకు శాసనసభలో గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ యేడాది జనవరిలో జరిగిన శాసనసభ తొలిసమావేశంలో గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రభుత్వం అందించిన ప్రసంగపాఠాన్ని చదవకుండా మొదటి పుట, చివరిపుటలో ఉన్నవాటిని మాత్రమే చదివి పూర్తి చేశారని అప్పావు పేర్కొన్నారు. కొత్త యేడాది ఆరంభంలో జరిగే ఈ సమావేశంలోనైనా ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని పూర్తిగా చదువుతారని ఆశిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశానికి వచ్చే గవర్నర్ మర్యాదలకు లోపం కలుగకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు ఎడప్పాడి పళనిస్వామికి కూడా తగిన గౌరవమిస్తున్నామని స్పీకర్ చెప్పారు. సభలో అందరికీ మాట్లాడేందుకు అవకాశం ఇస్తున్నామని అప్పావు స్పష్టం చేశారు.

వీసీల ఎంపికలో

సుప్రీంకోర్టు ఉత్తర్వుల బేఖాతరు

● ప్రభుత్వంపై గవర్నర్ రవి ఆగ్రహం

అడయార్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్నా యూనివర్సిటీ (చెన్నై), భారతిదాసన్ యూనివర్శిటీ (తిరుచ్చి), పెరియార్ యూనివర్శిటీ (సేలం) వైస్‌ఛాన్సలర్ల ఎంపిక కోసం సెర్చికమిటీల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు ఉత్వర్వులను ఉల్లఘించిందంటూ విశ్వవిద్యాలయాల ఛాన్సలర్, గవర్నర్ ఆర్ఎన్ రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీసీ 2018 నిబంధనల మేరకు వీసీల ఎంపికకు నియమించే సెర్చి కమిటీల్లో ప్రభుత్వ ప్రతినిధి, సెనేట్ ప్రతినిధి, సిండికేట్ ప్రతినిధితోపాటు యూజీసీ ఛైర్మన్ ప్రతిపాదించే ప్రతినిధి కూడా సభ్యులుగా ఉండాలని, ఆ మేరకు బిహార్‌కు సంబంధించిన వీసీల వివాదంలో 2013 జూలై 17న సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులో సెర్చి కమిటీలలో యూజీసీ ఛైర్మన్ ప్రతిపాదించే సభ్యుడు కూడా తప్పనిసరిగా ఉండాలని, యూజీసీ ప్రతినిధి లేని సెర్చికమిటీ సిఫారసు ప్రకారం చేసే వీసీల నియామకం చెల్లుబాటు కాదని సుస్పష్టంగా పేర్కొన్నదని, ఈ అంశాలను తాను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళామని శుక్రవారం గవర్నర్ రవి ప్రకటనలో తెలిపారు. ఈ పరిస్థితుల్లో అన్నా, భారతిదాసన్, పెరియార్ యూనివర్శిటీల వీసీల నియామకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లను ఉపసంహరించుకోవాలని విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ హోదాలో విజ్ఞప్తి చేస్తున్నానని, అదే సమయంలో ఆ వర్శిటీ వీసీల నియామకానికి తాజాగి యూజీసి ప్రతినిధిని కూడా సభ్యుడిగా చేరుస్తూ సెర్చికమిటీలను నియమించి తన పరిశీలనకు పంపించాలని గవర్నర్ కోరారు.


గవర్నర్ ఆర్ఎన్ రవి, మంత్రి కొవి చెళియన్

గవర్నర్‌పై న్యాయపరమైన చర్యలు

● మంత్రి కొవి చెళియన్

విద్యాశాఖలో అనవసరంగా జోక్యం చేసుకుంటే గవర్నర్ ఆర్.ఎన్. రవిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖామంత్రి కోవి చెళియన్ తెలిపారు. ఆయన శుక్రవారం పుదుక్కోటలో మీడియాతో మాట్లాడుతూ, వీసీలను ఎంపిక చేసే కమిటీలో ముగ్గురు సభ్యులను నింబంధనలకు అనుగుణంగానే ఎంపిక చేశామన్నారు. అయితే, తన హద్దులను తెలుసుకోని గవర్నర్ ఈ నియామకాన్ని తప్పుపట్టడం, యూజీసీ ఛైర్మన్ ప్రతిపాదించే సభ్యుడిని సెర్చి కమిటీలో నియమించాలని సూచించడం గవర్నర్ పరిధిలోని లేని విషయమన్నారు. కేంద్రంతో అనేక రకాలైన అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం కలిసి పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. అందువల్ల రాష్ట్ర గవర్నర్ తన పరిధి ఏదో తెలుసుకుని, ఆ మేరకు పనిచేయాలని,, అలా కాకుండా విద్యా శాఖ నిర్ణయాల్లో జోక్యం చేసుకుంటే మాత్రం న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి చెళియన్ హెచ్చరించారు.

రాష్ట్రానికి ఆరు రోజుల పాటు వర్ష సూచన

● ఐఎండి వెల్లడి

అడయార్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో వచ్చే ఆరు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇప్పటికే అల్పపీడన ప్రభావం కారణంగా చెన్నైలోని ప్యారీస్, అన్నా నగర్, సైదాపేట, మైలాపూర్, వడపళని, కోడంబాక్కం, నుంగంబాక్కం, థౌజండ్‌లైట్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం వేకువ జాము నుంచే తేలికపాటి వర్షం కురిసింది. అలాగే, కాంచీపురం, చెంగల్పట్టు, వేలూరు, తిరువళ్లూరు, మైలాడుదురై, తిరువారూర్, తంజావూరు, అరియలూరు, పెరంబలూరు, తిరుచ్చి జిల్లాల్లో మోస్తరు వర్షం కురుస్తుంది. ఈ నేపథ్యంలో ఈ అల్పపీడన ప్రభావం కారణంగా ఈ నెల 25వ తేదీ వరకు తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది. జాలర్లు కూడా సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళొద్దని, సముద్ర తీరంలో గాలుల వేగం గంటలకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని ఐఎండీ హెచ్చరించింది.

సమాచార దృష్టి

రూ.290 కోట్లతో తిరుచ్చిలో గ్రంథాలయం

ప్యారీస్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలో ప్రపంచ స్థాయిలో కరుణానిధి స్మారక గ్రంథాలయాన్ని రూ.290 కోట్లతో నిర్మించనున్నట్లు తమిళనాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ముఖ్యమంత్రి స్టాలిన్ జూన్ నెలలో అసెంబ్లీలో తిరుచ్చిలో ప్రపంచ స్థాయి భారీ గ్రంధాలయాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. ఆ ప్రకారం తిరుచ్చి జిల్లాలోని అభిషేకపురం ప్రాంతంలో గ్రంథాలయ నిర్మాణానికి రూ.235 కోట్లు కేటాయించగా, పుస్తకాల కొనుగోలుకు రూ.50 కోట్లు, ఫర్నిచర్ కోసం రూ.5 కోట్లు కేటాయించారు.

రేపు దుర్గా స్రవంతి ఆధ్వర్యంలో 'కథా వాహిని'

ప్యారీస్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నవలా రచయిత్రి మాలతీ చందూర్ జయంతిని పురస్కరించుకుని దుర్గా స్రవంతి సాంస్కృతిక విభాగం అధ్వర్యంలో ఆదివారం కథా వాహిని కార్యక్రమం జరగనుంది. మైలాపూర్‌లోని ఆంధ్ర మహిళా సభలో ఉదయం 11 గంటలకు దుర్గా భాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ, దుర్గా స్రవంతి సంయుక్త నిర్వాహణలో మాలతీచందూర్ నవల భూమిపుత్రిలోని దుర్గా పాత్రపై కథా వాహిని కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ఓఎంఆర్ విధానంలో గ్రూప్-2, 2ఏ

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సిన గ్రూప్-2, 2ఏ పరీక్షలు ఓఎంఆర్ విధానంలో నిర్వహించనున్నట్లు టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 2,540 గ్రూప్-2, 2ఏ పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ సెప్టెంబరు 14వ తేది రాతపరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు 7,93,966 మంది దరఖాస్తు చేసుకోగా 5,83,467 మంది హాజరయ్యారు. ఈ పరీక్షా ఫలితాలు డిసెంబరు 12వ తేది విడుదల చేశారు. ఉత్తీర్ణులైన వారికి ఈ నెల 22న ఆన్‌లైన్‌లో మెయిన్స్ నిర్వహించనున్నారు. ఇటీవల నిర్వహించిన టీఎన్‌పీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులున్నాయి. దీంతో ఆన్‌లైన్‌కు బదులు ఓఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

కొత్త ఐటీఐలో అడ్మిషన్లు

పెరంబూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన ఐటీఐల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో 102 ప్రభుత్వ, 311 ప్రైవేటు ఐఐటీలుండగా, ప్రస్తుతం కడలూరు, తిరువణ్ణామలై, దిండుగల్, రామనాధపురం, కృష్ణగిరి, నామక్కల్, పుదుకోట, తిరువారూరు, తిరుపత్తూర్, తూత్తుకుడి జిల్లాల్లో ఒక్కో ప్రభుత్వ ఐటీఐ ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో అడ్మిషన్లు పొందగోరు విద్యార్థులు ఈ నెల 31వ తేది లోపు తగిన సర్టిఫికెట్లతో ఐటీఐ కార్యాలయాలను సంప్రదించవచ్చు. వివరాలకు 9499055689 అనే నెంబరు సంప్రదించవచ్చు.

నేటినుంచి చెన్నై- పినాంగ్ మధ్య విమాన సర్వీసులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెన్నై- పినాంగ్ నగరాల మధ్య శనివారం నుంచి విమాన సేవలు ప్రారంభం కానున్నాయి. మలేసియా దేశం ఆధీనంలో ఉన్న పెనాంగ్ దీవి పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఆ ప్రాంతానికి నేరుగా విమాన సేవలు లేకపోవడంతో నగరం నుంచి వెళ్లే పర్యాటకులు ఇబ్బందులను ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ శనివారం నుంచి పినాంగ్‌కు నేరుగా విమాన సేవలు ప్రారంభించనుంది.

మహాకుంభమేళాకు రైళ్లలో ఉచిత ప్రయాణం లేదు

పెరంబూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం లేదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ప్రయాగ్‌రాజ్ నగర్‌లోని త్రివేణి సంగమంలో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళా జరుగనుంది. కుంభమేళాకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఉచిత రైళ్లు ఏర్పాటుచేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం అవాస్తమని స్పష్టం చేసింది.

నేటినుంచి కానిస్టేబుల్ పరీక్షకు ఉచిత శిక్షణ

పెరంబూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) గ్రూప్-4 విభాగంలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ శనివారం ప్రారంభం కానుంది. ఈ మేరకు తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ విడుదల చేసిన ప్రకటనలో... పట్టాభిరామ్ హిందూ కళాశాలలో ప్రతి శని, ఆదివారాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు జిల్లా ఎంప్లామెంట్ కార్యాలయం, శిక్షణా తరగతులు జరుగుతున్న కళాశాలను సంప్రదించవచ్చు.

నేటినుంచి అర్ధ సంవత్సర పరీక్షలు

అడయార్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అర్ధ సంవత్సర వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు అర్నెల్ల పరీక్షలు ఈ నెల 9వ తేదీ నుంచి జరగాల్సి ఉంది. కానీ, ఆ సమయంలో ఫెంగల్ తుఫాన్ కారణంగా పరీక్షలను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో శనివారం నుంచి ఈ పరీక్షలను నిర్వహించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

లాలాపేట ఫ్లైఓవర్‌పై బస్సు బోల్తా

- పది మందికి గాయాలు
- స్తంభించిన ట్రాఫిక్



భారీ క్రేన్‌తో బస్సును తొలగిస్తున్న అధికారులు

టి.నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరూరు జిల్లా లాలాపేట రైల్వే ఫ్లైఓవర్‌పై శుక్రవారం వేకువజామున ఆమ్నీ బస్సు బోల్తాపడటంతో తిరుచ్చి - కరూరు జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. తంజావూరు జిల్లా కుంభకోణం నుంచి కోయంబత్తూరుకు 8 మంది ప్రయాణికులు, డ్రైవర్, క్లీనర్ సహా మొత్తం పది మందితో ఓ ఆమ్నీ బస్సు బయల్దేరింది. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత 1.30 గంటల ప్రాంతంలో లాలాపేట రైల్వేఫ్లైఓవర్‌పై వెళుతుండగా అదుపుతప్పి ఫ్లైఓవర్ పిట్టగోడను ఢీకొని బోల్తాపడింది. బస్సులో ప్రయాణించిన పదిమందికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న లాలాపేట పోలీసులు, రహదారుల శాఖ ఉన్నతాధికారులు హుటాహుటిన అక్కడికి వెళ్లి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఆ వంతెనకు ఇరు వైపులా సుమారు 5 కిలోమీటర్ల వరకూ వాహనాలు నిలిచిపోయాయి. రహదారుల శాఖ ఉన్నతాధికారులు భారీ క్రేన్‌లను రప్పించి సుమారు మూడు గంటల పాటు ప్రయత్నించి వంతెనకు అడ్డంగా పడిన బస్సును తొలగించారు. ఆ తర్వాతే ఆ మార్గంలో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రాంతాల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

తిరుముల్లైవాయల్: వెల్లనూరు, కొల్లుమేడు, మహిళ పారిశ్రామికవాడ, కన్నడపాళయం, పొత్తూరు, అరిక్కమేడు, కాటూరు, లక్ష్మీపురం, పమ్మతుకుళం, కోనిమేడు, ఈశ్వరన్ నగర్, ఎల్లయమ్మన్‌పేట, గాంధీ నగర్, టీఎస్ రోడ్డు, ఎడపాళయం రోడ్డు, రెడ్‌హిల్స్

ఎన్నూర్: కత్తివాక్కం, ఎన్నూర్ బజార్, కాట్టుకుప్పం, నెహ్రూ నగర్, శాస్త్రి నగర్, అన్నా నగర్, శివన్‌పేట వీధి, వళ్లువర్‌నగర్, కామరాజ్‌నగర్, ఎస్వీఎం నగర్, వీఓసీ నగర్, ఉలగనాధపురం, ముఖద్వారం, ఎన్నూర్, ఎన్నూర్ కుప్పం, తాలంకుప్పం, నెడుకుప్పం, చిన్న కుప్పం, పెరియకుప్పం, ఎర్నావూర్ కుప్పం, ఈటీపీఎస్ క్వార్టర్స్, ఎర్నావూర్, జ్యోతినగర్, రామనాధపురం, శక్తిగణపతి నగర్, షణ్ముగపురం

పెరవళ్లూర్: దాచూర్ జంక్షన్ రోడ్డు, అళింజివాక్కం, బోరాక్స్ కంపెనీ, కిల్‌మేని, పెరవళ్లూర్, అత్తిపేడు, నత్తం, అండార్‌కుప్పం, సత్రం, కోడూర్, కేబీకే నగర్, టీవీ పురం వెల్లమ్మాళ్ రెసిడెన్సీ

పారివాక్కం: తిరుకోయిల్‌పత్తు, తిరుమనం, కావల్‌చ్చేరి, వయలానల్లూర్, సోరంజేరి, ఆయిల్‌జేరి, సిద్దుకాడు

పూందమల్లి: కేంద్రీయ విహార్, ఇండస్ట్రియల్ మేఘన ఎస్టేట్, నూంబల్ మెయిన్ రోడ్డు, పీఎస్ రోడ్డు, సన్నధి వీధి, వల్లికొల్లైమేడు, పల్లావన్ నగర్

అమిత్ షా వ్యాఖ్యలపై డీపీఐ, వామపక్షాల ఆందోళన



కోవైలో వామపక్షాల ధర్నా - హైకోర్టు వద్ద న్యాయవాదుల ధర్నా - డీపీఐ కార్యకర్తల రైలురోకో

అడయార్, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): రాజ్యసభలో జరిగిన చర్చా కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ కీర్తి ప్రతిష్ఠలను కించపరిచేలా వక్రీకరిస్తూ చేసిన ప్రసంగం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ డీపీఐ, ఉభయ కమ్యూనిస్ట్ సహా పలు పార్టీలన్నీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగాయి. అధికార డీఎంకే గురువారం వివిధ ప్రాంతాల్లో ఆందోళన చేయగా, శుక్రవారం మరికొన్ని పార్టీలు ఆందోళన చేశాయి. నగరంలోని వ్యాసార్పాడి ఎంకేబీ నగర్, పెరంబూరు జీవా రైల్వే స్టేషన్, వ్యాసార్పాడి మెకిషిన్ పురం తదితర ప్రాంతాల్లో జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో ఆయా పార్టీల నేతలు పాల్గొని కేంద్ర మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర మంత్రి పదవికి అమిత్ షా తక్షణం రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేరళ-తమిళనాడు సరిహద్దుల్లో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. కర్ణాటక నుంచి నీలగిరి జిల్లా గూడలూరు మీదుగా కేరళకు మాదకద్రవ్యాలు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో, రెండు రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. క్రిస్మస్, న్యూయర్ వేడుకలకు దేశ ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో, కేరళలో జరిగే వేడుకలకు కర్ణాటక, ఆంధ్ర తదితర రాష్ట్రాల నుంచి మాదకద్రవ్యాలు అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం అందటంతో, కేరళ-తమిళనాడు పోలీసులు గూడలూరు నడుకానిలో ఉన్న చెక్‌పోస్ట్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించిన మీదటే కేరళ సరిహద్దుల్లోకి అనుమతిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద రైతుల ధర్నా

ప్యారీస్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు సమీపంలోని మెల్మా గ్రామంలో వ్యవసాయ భూములను సేకరించి అక్కడ సిప్‌కాట్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి వేలు ఓ సమావేశంలో ప్రకటించారు. దీనిపై అక్కడి స్థానిక రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రైతులకు ఇష్టం లేకుండా సాగుభూములను తీసుకోవద్దని మెల్మా గ్రామంలోని ప్రభుత్వకార్యాలయాలకు వెళ్లి వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదని గురువారం సుమారు 50 మంది రైతులు మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా జరిపారు. మంత్రి ఈవీ.వేలుని కలుసుకుని వినతిపత్రం సమర్పించాలని ఆందోళనకారులు పట్టుబట్టారు. మంత్రి ఆఫీసులో లేరని చెప్పగా ఆవేశానికి గురైన రైతులు బలవంతంగా లోపలకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకొన్నారు. ఈ విషయం తెలుసుకున్న పరిశ్రమల శాఖమంత్రి రాజా వెంటనే వారి వద్దకు వెళ్లి చర్చలు జరిపారు. వారి సమస్యను ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

బాలికపై 'హత్యా'చారం కేసులో నిందితుడికి 2 యావజ్జీవకారాగార శిక్షలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల బాలికపై అత్యాచారం చేసి హతమార్చిన యువకుడికి న్యాయస్థానం రెండు యావజ్జీవ కారాగార శిక్షలను విధిస్తూ తీర్పు వెలువరించింది. మైలాడుదురై జిల్లా శీర్గాళి తాలూకా తిరువేంగాడు సమీపంలోని ఓ ప్రాంతానికి చెందిన వైరవేల్ 2019 నవంబరు 9న 15 ఏళ్ల బాలికపై అత్యాచారం చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలికను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. తిరువేంగాడు పోలీసులు పోక్సో, హత్య కేసులు నమోదు చేసి వైరవేల్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ పూర్తికావడంతో నిందితుడు వైరవేల్‌కు రెండు యావజ్జీవశిక్షలు, రూ.4,000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి విజయకుమారి గురువారం తీర్పు వెలువరించారు. దీంతో వైరవేల్‌ను పోలీసులు తిరుచ్చి కేంద్ర కారాగానికి తరలించారు.

పాంబారుపై వంతెన నిర్మించరూ..

- బడికి వెళ్లాలంటే దినదినగండమే!



తాడు పట్టుకుని పిల్లలను వాగు దాటిస్తున్న తల్లిదండ్రులు

టి.నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాణియంబాడి సమీపం ఆలంగాయం వద్దనున్న గ్రామాల ప్రజలు, విద్యార్థులు పాంబారుపై వంతెన నిర్మించాలని యేళ్ల తరబడి మొరపెట్టుకుంటున్నా ప్రయోజనం లేకుండా పోయింది. తిరుపత్తూరు జిల్లా ఆలంకాయం పంచాయతీ యూనియన్ పరిధిలోని పూంకుళం గ్రామపంచాయతీ పరిధిలోని కాళినగర్ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఊరి ప్రజలు మాట్లాడుతూ పూంకుళం పంచాయతీకి చెందిన కాళినగర్ ప్రాంతంలో 125కు పైగా నివాసాలున్నాయని, ఆ ఇళ్లలో వ్యవసాయ, పశువుల పెంపకం, కూలి పనులు చేసేవారే ఎక్కువ మంది నివసిస్తున్నారని తెలిపారు. తమ ఊరిలో పాంబారు అనే వాగు ప్రవహిస్తోందని, వర్షాకాలం వస్తే ఆ వాగులో మోకాలిలోతున వరదనీరు ప్రవహించి ఎవరూ దాటలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇటీవల కురిసిన ఫెంగల్ తుఫాన్ ప్రభావిత వర్షాల కారణంగా ఆ వాగులో వరద పరిస్థితులు నెలకొన్నాయని, దీంతో వాణియంబాడి ప్రాంతానికి, ఆలంకాయం ప్రాంతానికి నడుమ రాకపోకలు స్తంభించాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ ఆ వాగు వద్ద విద్యార్థులు మోకాలిలోతు నీటిలో రెండు వైపులా తాడు కట్టుకుని, దానిని ఆసరాగా చేసుకుని ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్నారని తెలిపారు. రాత్రి పూట ఆ వాగు దాటడానికి ఎవరూ సాహసించరని తెలిపారు. రోజూ కూలీపనులకు వెళ్ళి తిరిగొచ్చే కార్మికులు కూడా వాగులో ఈదుకుంటూ వస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఊరిలోని 125 కుటుంబాలకు చెందినవారంతా పాంబారు వాగుపై వంతెన నిర్మించాలని కోరుతూ ఆలంకాయం పంచాయతీ యూనియన్ కార్యాలయం, పూంగుళం పట్టణ పంచాయతీ కార్యాలయం, వాణియంబాడి రెవెన్యూ అధికారి కార్యాల యం, తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను కలుసుకుని పలుమార్లు వినతిపత్రాలను సమర్పించినా పట్టించుకోలేదని చెప్పారు. కనీసం విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని వీలయినంత త్వరగా ఆ వాగుపై వంతెన నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించిన కమల్

ప్యారీస్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు భారతీయులెవరు సహించబోరని మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ అన్నారు. ట్విట్టర్ వేదికగా ఆయన ఈ విషయంపై స్పందిస్తూ శీతాకాల సమావేశాల్లో రాజ్యంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించిన హోంమంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, ఆయనను కేంద్ర క్యాబినెట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

చెన్నై పోర్ట్‌లో చైనా టపాసుల స్వాధీనం

ప్యారీస్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): చెన్నై పోర్టుకు వచ్చిన రూ.1.5 కోట్ల విలువైన నిషేధిత చైనా టపాసులను స్వాధీనం చేసుకున్నారు. అధిక శబ్దం, వాతావరణాన్ని కాలుష్యం చేస్తున్న చైనా టపాసులను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ నేపథ్యంలో ఇటీవల చైనా నుంచి సరుకులతో చెన్నై పోర్ట్‌కి వచ్చిన ఓ ప్రవేట్ నౌకను అనుమానంతో కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఆ నౌకలోని కంటైనర్‌లో దాచిన రూ.1.5 కోట్ల విలువ గల చైనా టపాసులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి మహారాష్ట్రకు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం స్వాధీనం చేసుకున్న చైనా టపాసులను తిరిగి ఆ దేశానికే పంపించారు.

నీటమునిగిన విద్యార్థి కోసం గాలింపు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పన్రుట్టి తెన్‌పొన్నై నదిలో స్నేహితులతో స్నానాలకు వెళ్లిన కళాశాల విద్యార్థి గల్లంతయ్యాడు. కడలూరు ప్రభుత్వ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న అక్కడవల్లి గ్రామానికి చెందిన శంకర్ (20), ఐదుగురు స్నేహితులతో శుక్రవారం మధ్యాహ్నం తెన్‌పొన్నై నదికి స్నానానికి వెళ్లాడు. వారందరూ స్నానం చేస్తున్న సమయంలో శంకర్ హఠాత్తుగా లోతైన ప్రాంతానికి వెళ్లి మునిగాడు. సమాచారం తెలుసుకుని పుదుకోట పోలీసులు, పన్రుట్టి అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని శంకర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

గర్భం దాల్చిన విద్యార్థిని.. టీచర్ అరెస్ట్

ప్యారీస్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలోని ఓ విద్యార్థిని గత ఏడాది ప్రభుత్వ పాఠశాలలో ప్లస్2 పాసై, ప్రస్తుతం చెన్నైలోని ఓ హాస్టల్‌లో ఉంటూ బీఎస్సీ నర్సింగ్ చదువుతుంది. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం విద్యార్థిని బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో ఆశ్చర్యపోయిన విద్యార్థిని తల్లిదండ్రులు చెట్టియార్‌తోపు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గత సంవత్సరంలో విదార్థినిపై పలుమార్లు అత్యాచారం చేసినట్లు తేలింది. విద్యార్థిని భయపడి తను గర్భవతి అయిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పకపోవడంతో ఈ ఘటన వెలుగులోకి రాలేదు. నింధితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతని అరెస్టు చేసి జైలుకి తరలించారు.

శ్మశానవాటికల్లో ఆన్‌లైన్ రిజర్వేషన్

పెరంబూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని శ్మశానవాటికల్లో ఆన్‌లైన్ ముందస్తు నమోదు ప్రారంభం కానుంది. ఈ మేరకు జీసీసీ డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ... అంత్యక్రియలకు వచ్చే వారి నుంచి శ్మశానవాటికల సిబ్బంది నగదు వసూలుచేస్తున్నట్లు ఫిర్యాదులందుతున్నాయన్నారు. ప్రస్తుతం బీసెంట్ నగర్ శ్మశానవాటికలో ముందస్తు నమోదు ప్రక్రియ ఉందని, దానిని అన్ని శ్మశానవాటికల్లో అమలుచేసేలా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

అరుణాచలేశ్వరుడి హుండీ ఆదాయం రూ.2.83 కోట్లు

పెరంబూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.2.83 కోట్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. తిరువణ్ణామలైలో కార్తీక దీపోత్సవాలు ఈ నెల 4వ తేది ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో సుమారు 30 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల లెక్కింపు గురువారం ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.2 కోట్ల 83 లక్షల 92 వేల 520 నగదు, 164 గ్రాముల బంగారం, కిలో వెండి సమర్పించారు. అలాగే, పలు దేశాల కరెన్సీ కూడా హుండీల్లో ఉన్నాయని ఆలయ జాయింట్ కమిషనర్ జ్యోతి తెలిపారు.

కోవైలో బ్లాక్‌డే ర్యాలీ అన్నామలై సహా నేతల అరెస్టు

చెన్నై, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోవై బాంబు పేలుళ్ల ప్రధాన నిందితుడు ఉగ్రవాది బాషా అంత్యక్రియలకు ర్యాలీ నిర్వహించేందుకు పోలీసులు అనుమతించడంపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ నగరంలో బ్లాక్‌డే పాటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, ఇతర నాయకులు ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించారు. అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించినందుకు అన్నామలై సహా పార్టీకి చెందిన వందమందిని పోలీసులు అరెస్టు చేశారు.

ఫేక్ వీడియో పోస్ట్.. బీజేపీ నేతపై కేసు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫేక్ వీడియో పోస్ట్ చేశారనే ఫిర్యాదుపై బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ మీద కేసు నమోదైంది. అశోక్‌కుమార్‌పై చెన్నై సెంట్రల్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదుచేశారు. బంగ్లాదేశ్ హిందువులపై దాడులకు సంబంధించి ఫేక్ వీడియో పోస్ట్ చేశారని అశోక్‌కుమార్‌పై ఆరోపణలున్నాయి.

రైలు ప్రయాణికులకు 3 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్

పెరంబూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు టిక్కెట్ల కోసం గంటల తరబడి కౌంటర్ల వద్ద వేచి ఉండడం తగ్గించేలా రైల్వే శాఖ డిజిటలైజేషన్ అమలులోకి తెచ్చింది. ఆ ప్రకారం, యూటీఎస్ యాప్ ఆర్-వాలెట్ ద్వారా బుకింగ్ చేసుకున్న టిక్కెట్లపై 3 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్ ప్రకటించింది. ఆర్-వాలెట్ రీఛార్జికి కూడా ఈ ఆఫర్ వర్తించనుంది. యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా ప్రయాణికులు ఇల్లు, ప్రయాణం చేసే సమయంలో అన్‌రిజర్వ్‌డ్, ప్లాట్‌పారం, సీజన్ టిక్కెట్లు పొందవచ్చు. అదే సమయంలో, కౌంటర్ల వద్ద వేచి ఉండాల్సిన అవసరం ఉండదని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

చెయ్యారు నదిలో మురుగన్ విగ్రహం లభ్యం



వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెయ్యారు నది వరదల్లో కొట్టుకొచ్చిన రెండడుగుల మురుగన్ విగ్రహాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరువణ్ణామలై జిల్లా తిరువత్తిపురం చెయ్యారు నది వరద ప్రవాహంలో గురువారం మధ్యాహ్నం రెండడుగుల ఎత్తులో నెమిలితో కూడిన మురుగన్ విగ్రహాన్ని స్థానికులు గమనించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ శాఖ అధికారులు అక్కడకు చేరుకొని విగ్రహాన్ని స్వాధీనం చేసుకొని, ఆ విగ్రహం వివరాలు కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

జల్లికట్టు ఎద్దుకు అంత్యక్రియలు



అలంకరించిన ఎద్దు కళేబరం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): మదురై జిల్లాలో మృతిచెందిన జల్లికట్టు ఎద్దుకు గ్రామస్తులు అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. ఏలుమలై సమీపం పాపినాయకన్‌పట్టికి చెందిన మలైపాండి జల్లికట్టు ఎద్దును సంరక్షిస్తున్నారు. పాపినాయకన్‌పట్టి, అలంగానల్లూర్, పాలమేడులో నిర్వహించిన జల్లికట్టు పోటీలో పాల్గొన్న ఈ ఎద్దును ఎవరూ అదుపుచేయలేకపోయారు. పలు పోటీల్లో కానుకలు పొందింది. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆ ఎద్దు గురువారం మృతిచెందింది. గ్రామంలోని పిల్లలు, పెద్దలందరూ ఎద్దు కళేబరాన్ని అందంగా అలంకరించి వాహనంపై ఉంచి ఊరేగింపుగా గ్రామ శివారు ప్రాంతానికి తీసుకెళ్లి ఖననం చేశారు.

లోకో పైలెట్‌కు అస్వస్థత.. నిలిచిన సప్తగిరి ఎక్స్‌ప్రెస్

- ఆస్పత్రికి తరలింపు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హఠాత్తుగా అస్వస్థతకు గురైన లోకోపైలెట్ ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపి ఆస్పత్రికి వెళ్లిన ఘటన తిరువళ్లూర్‌లో చోటుచేసుకుంది. తిరుపతి నుంచి చెన్నైకి గురువారం సాయంత్రం సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైలు బయల్దేరింది. యుగేంద్రన్ లోకోపైలెట్‌గా డ్యూటీలో ఉన్నారు. రైలు తిరువళ్లూర్ సమీపంలో వస్తుండగా, యుగేంద్రన్‌కు హఠాత్తుగా కడుపు నొప్పితో వాంతులు చేసుకున్నాడు. ఆ స్థితిలో అతను రైలు నడపలేకపోయాడు. రైలు రాత్రి 9 గంటలకు తిరువళ్లూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న సమయంలో మూడో ప్లాట్‌పారంపై రైలు నిలిపివేసిన యుగేంద్రన్, తన ఆరోగ్య పరిస్థితిపై ఉన్నతాధికారులకు, స్టేషన్‌మాస్టర్‌కు సమాచారం ఇచ్చాడు. వెంటనే అంబులెన్స్ రప్పించి యుగేంద్రన్‌ను తిరువళ్లూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గంటకు పైగా స్టేషన్‌లో రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అత్యవసర పనులకు వెళ్లే ప్రయాణికులు దిగి సబర్బన్ రైళ్లలో చెన్నై బయల్దేరారు. ఆ తరువాత చెన్నై నుంచి వచ్చిన మరొక డ్రైవర్‌తో ఆ రైలు 10.15 గంటల ప్రాంతంలో చెన్నై బయల్దేరింది.

అగ్నిప్రమాదాల నిరోధంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వాషర్‌మెన్ పేట, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): తేని జిల్లా ఆండిపట్టిలో అగ్నిప్రమాదాల నుంచి బయటపడడం, నిరోధక చర్యలపై విద్యార్థులకు అవగాహనా శిబిరం నిర్వహించారు. అగ్నిమాపక, అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తిమ్మారస నాయకనూరు ప్రభుత్వ పాఠశాలలో ఫారెస్ట్ రేంజర్ అరుళ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మ సంరక్షణకు వాడే పరికరాలు ఎలా ఉపయోగించాలో విద్యార్థులకు ప్రదర్శనగా చూపెట్టారు.

హుండీలో జారిపడిన 'ఐ' ఫోన్

- దేవుడికే సొంతమని ప్రకటించిన అధికారులు

ప్యారీస్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అనుకోకుండా హుండీలో పడిపోయిన ఐ ఫోన్ దేవుడికే సొంతమని హిందూ దేవాదాయ శాఖా అధికారులు తేల్చిచెప్పారు. స్థానిక అంబత్తూర్ వినాయకపురానికి చెందిన దినేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి రెండు నెలల క్రితం చెంగల్‌పట్టు జిల్లా తిరుప్పోరూర్ కందస్వామి ఆలయానికి వెళ్లాడు. అక్కడున్న హుండీలో కానుకలు వేస్తుండగా ఆయన చేతిలోని ఐఫోన్ కూడా జారి పడింది. దినేష్ నుంగంబాక్కంలో ఉన్న దేవాదాయ శాఖా కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గురువారం హుండీ తెరిచి కానుకలు లెక్కించారు. ఐఫోన్ తిరిగివ్వడం జరగదని అధికారులు తేల్చిచెప్పారు. సిమ్‌కార్డ్, మెమరీ కార్డులను మాత్రం ఇవ్వడంతో దినేష్ వెళ్లిపోయాడు.

రేపు ఎంసీటీబీసీ 146వ వార్షికోత్సవం

ప్యారీస్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెపేరి హైరోడ్డులో ఉన్న మద్రాసు సెంటనరీ తెలుగు బాప్టిస్టు సంఘం (ఎంసీటీబీసీ) 146వ వార్షికోత్సవం ఆదివారం ఉదయం సంఘ కాపరి రెవ. డా. ఎస్.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరగనుంది. ఆంగ్లేయుల పాలనా హయాంలో తెలుగు క్రైస్తవుల కోసం పెట్టిన ఈ ప్రార్థనా మందిరం విద్య, ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతోంది. ఆదివారం 146వ వార్షికోత్సవం, 25వ తేదీ ఉదయం 9.30 గంటలకు క్రిస్మస్ ఆరాధన, 31వ తేదీ మంగళవారం రాత్రి 9. గంటల నుంచి నూతన సంవత్సర ఎదుర్కోలు ఆరాధనలో భాగంగా ఫిల్మ్‌షో, భక్తి సంగీతం, వాక్య పరిచర్య, ప్రభు సంస్కారాధన, 2025 1వ తేదీ బుధవారం ఉదయం 9.30 గంటలకు నూతన సంవత్సర ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి పోతల ప్రభుదాస్, అధ్యక్షులు జి.రామయ్య, కోశాధికారి ఐ.మార్క్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

'క్రిస్మస్'కు 706 ప్రత్యేక బస్సులు

ప్యారీస్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, వారాంతర సెలవు రోజుల్లో సొంతూర్లకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం తమిళనాడు స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) ఆధ్వర్యంలో శని, ఆదివారాలు, క్రిస్మస్ పండుగ రోజైన బుధవారాల్లో 706 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ప్రకటించాయి. కీలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోవిల్, కన్నియకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుపూర్ ప్రాంతాలకు శుక్రవారం 325, శనివారం 280 బస్సులు నడుపనున్నారు. కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, నాగపట్నం, వేళాంకన్ని, హోసూరు బెంగళూరు ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో 21 ప్రత్యేక బస్సులు, మాధవరం బస్ స్టేషన్ నుంచి 20 ప్రత్యేక బస్సులు మొత్తం 706 బస్సులు ఈ నెల 25వ తేదీ వరకు నడుపుతున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది. సొంతూర్లకు వెళ్లిన వారు మళ్లీ నగరానికి తిరిగొచ్చేందుకు అవసరాన్ని బట్టి అన్ని జిల్లాల కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆ సంస్థ తెలిపింది.

'బన్ బటర్ జామ్' టీజర్ రిలీజ్

'బిగ్‌బాస్' ఫేం రాజు హీరోగా నటించిన చిత్రం 'బన్ బటర్ జామ్'. ఈ సినిమా టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. వెట్రిమారన్ దర్శకత్వంలో సూరి, విజయ్ సేతుపతి, మంజు వారియర్ కాంబినేషన్‌లో వచ్చిన 'విడుదలై-2' ప్రదర్శించే కొన్ని థియేటర్లలో ఈ సినిమా టీజర్ ప్రదర్శిస్తున్నట్టు మూవీ మేకర్స్ వెల్లడించారు. రెయిన్ ఆఫ్ ఆరోస్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై సురేష్ సుబ్రమణియన్ నిర్మాణంలో రాఘవ్ మిర్దాథ్ దర్శకత్వంలో మూవీ రూపొందింది. రాజు, ఆద్య ప్రసాద్, భవ్య త్రిఖ హీరోహీరోయిన్లు. సీనియర్ నటి శరణ్య, దేవదర్శిని, చార్లీ, మైఖేల్ తంగదురై, వీజే పుష్ప ఇతర పాత్రలు పోషించారు. నేటి జనరేషన్‌లో రిలేషన్‌షిప్‌ను కామెడీ కోణంలో తెరకెక్కించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'మనిషిని ఎన్ని సమస్యలు చుట్టుముట్టినా ఆ క్షణాన్ని సంపూర్ణంగా ఆస్వాదిస్తూ జీవించడం అలవాటు చేసుకుంటే జీవితంలో సంబరాలకు ఎలాంటి లోటుండదనే కోణంలో ఈ స్ర్కీన్‌ప్లే కొనసాగుతుంది. చెన్నై, దాని పరిసర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేశాం. చివరి దశ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. త్వరలో ఆడియో, ట్రైలర్ రిలీజ్ చేయనున్నాం' అని వివరించారు.


'బన్ బటర్ జామ్'లో బిగ్‌బాస్ ఫేం రాజు





'ఉత్తమ నటి' అవార్డు అందుకుంటున్న సాయిపల్లవి - 'ఉత్తమ నటుడు' విజయ్ సేతుపతి

ముగిసిన చెన్నై ఫిల్మ్ ఫెస్టివల్

● ఉత్తమ నటిగా సాయిపల్లవి

చిత్రజ్యోతి

22వ చెన్నై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ముగింపు వేడుకలు గురువారం రాత్రి రాయపేట పీవీఆర్ సత్యం సినిమాస్ వేదికగా జరిగాయి. ఇందులో తమిళ చిత్రపరిశ్రమకు చెందిన అనేకమంది సినీ ప్రముఖులు పాల్గొని సందడి చేశారు. ఈ చిత్రోత్సవాల్లో భారతీయ భాషలతో పాటు పలు విదేశీ చిత్రాలను ప్రదర్శించారు. ముఖ్యంగా తమిళ విభాగంలో ఉత్తమ చిత్రంగా 'అమరన్' ఎంపిక కాగా, ఇందులో హీరోయిన్‌గా నటించిన సాయిపల్లవికి ఉత్తమ నటి అవార్డు దక్కింది. అలాగే, ఉత్తమ నటుడిగా 'మహారాజ' హీరో విజయ్ సేతుపతి, ఉత్తమ సంగీత దర్శకుడుగా జీవీ ప్రకాష్ కుమార్ (అమరన్), ఉత్తమ కెమెరామెన్‌గా సీహెచ్ సాయి (అమరన్), ఉత్తమ ఎడిటర్‌గా ఫిలోమిన్ రాజ్ (అమరన్), ఉత్తమ సహాయ నటుడిగా దినేశ్ (లబ్బర్ పందు), ఉత్తమ బాలనటుడిగా పొన్‌వేల్ (వాళై), ఉత్తమ సహాయనటిగా దుషార విజయన్ (వేట్టయన్), ఉత్తమ కథా రచయితగా నిథిలన్ స్వామినాథన్ (మహారాజ) అవార్డులు అందుకున్నారు. స్పెషల్ జ్యూరీ అవార్డును 'వాళై' చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్, 'తంగలాన్' మూవీ పా.రంజిత్‌లకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 'మహారాజ' మూవీని ఆదరించిన ప్రేక్షకులకు విజయ్ సేతుపతి ధన్యవాదాలు తెలిపారు. నటి సాయిపల్లవి మాట్లాడుతూ, 'దేశం కోసం నిరంతర శ్రమించిన ఒక జవాను కథ అమరన్. రాజ్‌కుమార్ పెరియస్వామి వంటి దర్శకులే ఇలాంటి మరెన్నో కథలు మనకు అందించగలరు' అని వ్యాఖ్యానించారు. ఈ ముగింపు వేడుకల్లో నిర్వాహకులతో పాటు కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్వీ ఉదయకుమార్, నటుడు నాజర్, నిర్మాత అమ్మ రాజశేఖర్, సీనియర్ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు హీరోయిన్లతో 'ఫైర్'


చాందిని తమిళరసన్

'బిగ్‌బాస్' తమిళ రియాలిటీ షో ద్వారా గుర్తింపు పొందిన బాలాజీ మురుగదాస్ హీరోగా తెరకెక్కిన 'ఫైర్' మూవీలో నలుగురు హీరోయిన్లు నటించారు. ఇందులో రచిత మహాలక్ష్మి, సాక్షి అగర్వాల్, గాయత్రి షాన్, చాందిని తమిళరసన్ నటించారు. జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ పంపిణీదారుడు జేఎస్‌కే సతీష్ కుమార్ దర్శకత్వం వహించి సొంతంగా జేఎస్‌కే ఫిలిమ్ కార్పొరేషన్ పతాకంపై నిర్మించారు. ఈ సినిమా గురించి ఆయన మాట్లాడుతూ, వాస్తవిక సంఘటనను ఆధారంగా చేసుకుని సీట్ ఎడ్జ్ గ్రిప్పింగ్ క్రైమ్ డ్రామాగా తెరకెక్కించాం. ఈ మూవీ ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది' అని పేర్కొన్నారు. నటి గాయత్రి షాన్ మాట్లాడుతూ, 'మహిళలను మోసం చేసే పురుషులకు, పురుషులను మోసం చేసే మహిళలకు ఒక గుణపాఠంలా ఉంటుంది' అని పేర్కొన్నారు.



రచిత మహాలక్ష్మి



వెండితెరపై వరలక్ష్మి తల్లి!

విలక్షణ నటి వరలక్ష్మి తల్లి ఛాయ వెండితెరపై కనిపించనున్నారు. దర్శకుడు బాల తెరకెక్కించిన 'వణంగాన్' మూవీలో ఆమె కీలక పాత్ర పోషించారు. తాజాగా ఆ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక నగరంలో జరిగింది. ఆ మూవీలో నటించిన నటీనటులంతా వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నటుడు శరత్ కుమార్ మాజీ భార్య, తన తల్లి ఛాయతో కలిసి వరలక్ష్మి పాల్గొనడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఛాయ పాత్ర ఎలా ఉంటుంది, ఆమె ఎలా నటించివుంటారన్న ఆసక్తికర చర్చ సాగుతుంది. ఇదిలావుండగా బాల దర్శకత్వంలో నటించిన నటీనటులంతా ఇపుడు ఉన్నతస్థితిలో ఉన్నారు. ఇలాంటి వారిలో విక్రమ్, సూర్య, ఆర్య, అధర్వ తదితరులున్నారు. తన చిత్రాల్లోని పాత్రలకు కొత్త నటీనటులను ఎంపిక చేసి, వారికంటూ ఒక గుర్తింపు మాత్రమే కాకుండా, వారి పేరు కూడా మారిపోయేలా దర్శకుడు బాల వారిని నటనలో తీర్చిదిద్దుతారు. 'పితామగన్' సినిమాలో విలన్‌గా నటించిన మహాదేవన్ ఇపుడు 'పితామగన్ మహాదేవన్'గా స్థిరపడిపోయారు. సో.. 'వణంగాన్' మూవీ విడుదలైన తర్వాత ఛాయ పేరు కూడా 'వణంగాన్ ఛాయ'గా మారుతుందో లేదో వేచిచూడాలి.

ధ్యానం ధ్యేయం... ఆరోగ్యమే మహాభాగ్యం



'ధ్యానావస్థ అనేది సృష్టిలో చాల గొప్పది'. విషయాలకు సాక్షీభూతంగా వ్యవహరించటం వల్లనే నిజమైన ఆనందాన్ని పొందగలం. ధ్యానం నుంచి బయటకు వచ్చినప్పుడు నీ జీవితంలో ఎప్పుడూ పొందని ఒక అమోఘమైన విశ్రాంతి పొందుతారు. నీ శరీరావస్థలన్నింటికీ విశ్రాంతినిచ్చే మార్గం ఇదే' అన్నారు స్వామి వివేకానంద. కుల, మత, పేద, ధనిక భేదాలు లేకుండా, యోగా విద్య నేడు అందరికీ చేరువైంది. శనివారం 'ప్రపంచ ధ్యాన దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం... వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి.

● నేడు ప్రపంచ ధ్యాన దినోత్సవం






యోగా, ధ్యానం అనగానే అందరి దృష్టి భారతదేశం వైపే. ఎన్నో వేల సంవత్సరాల నుండి యోగా విద్యకు ఘన వారసత్వం కలిగిన దేశంగా భారత్ ప్రపంచదేశాల్లో అగ్రస్థానంలో నిలిచింది. ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో 2014వ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి జూన్ 21వ తేదీని 'ప్రపంచ యోగా దినోత్సవం'గా ప్రకటించింది. లిచ్‌టెన్ స్టీన్ అనే దేశం 'ప్రపంచ ధ్యాన దినోత్సం' గురించి ఐక్యరాజ్య సమితిలో ప్రతిపాదించిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ దిశగా జరిగిన ప్రయాణంలో భారత్ సహా శ్రీలంక, నేపాల్ మెక్సికో, అండోర్రా మొదలైన దేశాలు బలంగా కృషి చేశాయి నాడు జూన్ 21వ తేది 'ప్రపంచ యోగా దినోత్సవం'గా ప్రకటించడంలోని ప్రత్యేకతను తెలుపుతూ ప్రధాని మోదీ ఉత్తరార్ధ గోళంలో జూన్ 21వ తేది పగలు ఎక్కువగా ఉన్న రోజుని (లాంగెస్ట్ డే) తెలిపారు. అలాగే నేడు ప్రపంచ ధ్యాన దినోత్సవంగా డిసెంబర్ 21వ తేదీ ప్రకటించడంలోని ప్రాముఖ్యతను చెబుతూ ప్రధాని 'శీతాకాలంలో ఉత్తరార్ధ గోళంలో డిసెంబర్ 21వ తేది పగలు కనిష్ఠంగా రాత్రి పొద్దు గరిష్ఠంగా ఉంటుందన్నారు. ఈ రెండు దినోత్సవాలకు ఐరాస ఆమోద ముద్రవేయడంలో తేదీల నిర్ధారణలో భారత్‌దే ప్రముఖ పాత్ర అని చెప్పనక్కరలేదు.

ధ్యానం అంటే...

మనసు నిండా పేరుకొని ఉన్న ఆలోచనలను ఖాళీ అయి చిత్తం ప్రశాంతంగా నిర్మలత్వం పొందడమే ధ్యానం. ధ్యానావస్థ అనేది సృష్టిలో చాలా గొప్ప అలౌకిక, అద్భుతమైన జీవన విధానం. మనల్ని మనం తెలుసుకొనే ప్రయాణంలో మనలోకి మనం చేసే ప్రయాణం. 'ఎప్పటికీ మార్పు చెందని అనంతమైన ఆనందం ఒకటి ఉంటే ధ్యానం దాని తలుపుల్ని మన కోసం తెరుస్తుంది. సత్యానికి చేరువుగా తీసుకొని వస్తుంది' అంటారు స్వామివివేకానంద. ధ్యానం అలవాటైన మనిషి ప్రశాంత చిత్తానికి యాజమాని అవుతాడు. ధ్యానం ఎవరికి వారే తప్పనిసరిగా చేయాల్సిన అంతర్ముఖ ప్రయాణం. ఎవరికి వారే పొందే అనిర్వచనీయమైన ఆనందానుభూతి మనసుని శుద్ధిచేసే ప్రక్రియ.

తమిళనాడు - ధ్యానం: తమిళనాట ఎందరో ధ్యానగురువులు, ధ్యాన కేంద్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. స్వామి వివేకానంద సరస్వతి, స్వామి డాక్టర్ టీఏ.కృష్ణన్, వేదాద్రి మహర్షి, సద్గురు జగ్గీవాసుదేవ్ తదితర ప్రఖ్యాతి యోగ, ధ్యాన గురువులు తమిళనాట యోగ, ధ్యాన విద్యకు ప్రజాదరణ కలిగించారు. చెన్నై నగరంలో ఎన్నో ధ్యాన శిక్షణా కేంద్రాల్లో శిక్షణ ఇచ్చేవారు కొందరైతే, కార్పొరేట్ సంస్థలోని ఉద్యోగులు, స్కూలు, కాలేజీ విద్యార్థులకు నేర్పించేవారు మరికొందరు. ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడంతో ఇల్లూ యోగా, ధ్యాన కేంద్రాలుగా మారుతున్నాయి.



ధ్యానం... ప్రయోజనాలు

రోజూ ధ్యానం చేస్తుంటే ఎన్నో ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చు. రక్తపోటు, శ్వాస సంబంధిత సమస్యలు నియంత్రించబడతాయి. మానసిక క్రమశిక్షణ, సత్ప్రవర్తన, సమగ్ర ఆరోగ్యం, జ్ఞాపకశక్తి పెంపొందుతాయి. నాడీ మండల వ్యవస్థ శుద్ధి అవుతుంది. పరధ్యానాన్ని తగ్గించుకోవడంలో సాయపడుతుంది. ధ్యానం ద్వారా మానసిక ఆరోగ్యం, తద్వారా శారీరక ఆరోగ్యం చేకూరుతాయి. రోగనిరోధక శక్తి వృద్ధి పొంది ఎన్నో అనారోగ్యాలను దూరం చేస్తుంది. అందుకే ప్రతిదినం ధ్యానం చేయడం అవసరమంటున్నారు వైద్యనిపుణులు.

ధ్యానం ఎలా చెయ్యాలి, ఎక్కడ చెయ్యాలి?

ధ్యానం చెయ్యాలంటే హిమాలయాల్లో ఏకాంతాన్ని ఆశ్రయించనక్కరలేదు. కఠోర తపస్సూ చేయనవసరం లేదు. సన్యాసిగా, యోగిగా మారాలనే కట్టడీ లేదు. మరెలా?.. ముందుగా మనసును ప్రశాంతపరిచే నైపుణ్యాన్ని గురువు మార్గదర్శకత్వంలో పొందాలి. ఆటంకం లేని ప్రదేశంలో, సౌకర్యవంతమైన దుస్తులు ధరించి పద్మాసనంలో లేదా సుఖాసనంలో లేదా ఏదైనా అనుకూలమైన భంగిమలో ఆశీనులు కావాలి. మనస్సు, బుద్ధిని పరమాత్మపై నిలపాలి. కళ్ళు మూసుకొని నెమ్మదిగా దీర్ఘంగా శ్వాస పీల్చి వదలాలి. క్రమేపి శ్వాస మీద ధ్యాస నిలిపి దాన్నే గమనిస్తుండాలి. ఎన్నో ఆలోచనలు మనసున ముసురుకొని వస్తూ పోతుంటాయి. సాక్షీభూతంగా మనకి ప్రమేయం లేదన్న భావనతో మనస్సును నియంత్రించుకొని సాధన చెయ్యాలి. ధ్యానంలో ఏకాగ్రత సాధించేటందుకు రెండు మార్గాలున్నాయి. సగుణ, నిర్గుణ, మార్గాలు. భగవంతుని సాకారంగా ధ్యానించడం సగుణ మార్గమైతే, పరమాత్మను చైతన్యంగా భావించి ధ్యానించడం నిర్గుణమార్గం. ఈ రెండు గమనాలు వేరేకానీ గమ్యం ఒకటే.

సాధన సమయంలో మనసు, శరీరం ఎన్నో మార్పులకు గురవుతుంది. ఆవలింతలు రావడం, శరీరంలో అసంకల్పితంగా కదలికలు కలగడం, శరీరం పులకలెత్తడం, మనసు సంతోషంతో నిండి పోవడం ఇలా ఎన్నో మార్పులు సంభవిస్తుంటాయి. అయితే వాటన్నిటిని సాక్షీభూతంగా చూడాలి. సాధన చేస్తే కొద్దీ ఏకాగ్రత, ప్రశాంతత అలవడుతాయి. ఒక క్రమ పద్ధతిలో సమయాన్ని ఎంచుకుని ప్రతీ నిత్యం ధ్యానం చేస్తే పొందే లాభాలు ఎన్నో... ఎన్నెన్నో.

భారతదేశం... ధ్యానం

భారతదేశం యోగా, ధ్యానవిద్యలకు పుట్టినిల్లు. మనకు యోగావిద్యను సమగ్రంగా, ఆచరణయోగ్యంగా అందించిన మహానుభావుడు పతంజలి మహర్షి. పతంజలి మహర్షి ఎన్నో వేల సంవత్సరాలకు పూర్వం వాడైనా, నేటికీ ఆయన రాసిన యోగా సూత్రాలే మనకు ప్రామాణికం. ఆయన అందించిన అష్టాంగ యోగమార్గమే అందరికీ అనుసరణీయం. పతంజలి తెలిపిన అష్టాంగ యోగసూత్రాలలో యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, దారణ, ధ్యాన, సమాధిలకి చెందిన యోగసూత్రాలు తెలుపబడి ఉన్నాయి. ప్రపంచానికి కూడా యోగ, ధ్యాన మార్గంలో భారతదేశమే దారిచూపింది.

రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద తదితర మహానుభావులు ధ్యాన మార్గాన్ని అనుసరించిన వారే. ప్రఖ్యాత ఆధ్యాత్మిక బోధకుడు ఆచార్య రజనీష్(ఓషో) ధ్యానాన్ని ఒక సులువైన ప్రక్రియగా అభివర్ణించారు. ధ్యానం శారీరకంగా, మానసికంగా, చురుకుదనం, చైతన్యం, వివేకం కలిగిస్తుందని పేర్కొన్నారు. పరమహంస యోగానంద సనాతన ధ్యాన ప్రక్రియను విశ్వవ్యాప్తంగావించారు.

'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకుడు రవిశంకర్ ధ్యాన విద్యను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారంలోకి తెచ్చారు. పిరమిడ్ ధ్యాన గురు సుభాష్ పత్రి, సద్గురు జగ్గీ వాసుదేవ్ ఇలా ఎందరో గురువులు శాస్త్రీయ విధానంలో ధ్యాన ప్రక్రియలను వ్యాప్తి చేశారు. 'సుదర్శనక్రియ, విపశ్యన, ఈశాక్రియ,' మొదలైన ఎన్నో ధ్యాన పద్ధతులతో ధ్యాన గురువులు ప్రజలకు ధ్యానం పట్ల అవగాహన కల్పిస్తున్నారు. దారులు వేరైనా చేరే మార్గం ఒక్కటే.

ధ్యానం మనసుపై ఎంతో ప్రభావం



ఏజీ గోపిచంద్ యోగా గురు

విశ్రాంత ఇంజనీరైన ఏ.జీ.గోపిచంద్ ఉద్యోగ విరమణ అనంతరం యోగా మీద ఆసక్తితో యోగాలో ఎం.ఏ.ఎం.ఫిల్ సాధించి చెన్నైలో ఎన్నో విద్యాసంస్థల్లో, యోగా సెంటర్లలోను, యోగా, ధ్యాన తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవ సందర్భంగా గోపీచంద్‌తో జరిపిన ముఖాముఖీలో ఆయన తన అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో ఇలా పంచుకున్నారు... "ధ్యానం మనసుపై ఎంతో ప్రభావం చూపుతుంది. మనిషిలోని ప్రతికూల భావాలను పోగొట్టి, వారిలో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తుంది. చాలా సంవత్సరాలుగా నేను ఎంతోమంది విద్యార్థులకు ధ్యాన శిక్షణ తరగతులను నిర్వహించాను. ఇప్పటికీ కొనసాగిస్తున్నాను. కోపం, అసూయ, చిరాకు, చెడు అలవాట్లు దూరమై వారిలో చదువుపై ఏకాగ్రత కుదరడం, సంతోషంగా, ప్రశాంతంగా తల్లిదండ్రులతో గడపటం మొదలైన మార్పులు వారిలో గమనించిన అంశాలు. ధ్యానంతో భావితరాల భవిష్యత్తు ఉజ్వలంగా ప్రకాశిస్తుందనడంలో అతిశయోక్తి లేదు."


యోగా చేస్తున్న విద్యార్థులు

నేటి జీవనశైలి... ధ్యానం ఆవశ్యకత

నేటి యాంత్రిక యుగంలో, ఉరుకుల పరుగుల జీవితాలలో వయోభేదం లేకుండా, ప్రతి ఒక్కరు ఒత్తిడికి గురి అవుతున్నవారే సమాజంలోని అధిక భాగం ఏదో ఒక విధమైన మానసిక ఒత్తిడిని అనుభవిస్తున్నారు. అనారోగ్యం, ఆత్మహత్య ఇలా వత్తిడి కారణంగానే సంభవిస్తున్నాయి. ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే సమస్యలకు, సవాళ్ళకు జవాబు 'ధ్యానం' మరి ఆలస్యమెందుకు? 'ధ్యానం' ప్రారంభించండి. రేపటి మీ భవిష్యత్తు మరెక్కడో లేదు. రోజు వారీ దినచర్యలోనే ఉంది. అందుకే 'ధ్యానం' దినచర్యలో భాగం చేసుకుందాం. భవిష్యత్తును బంగారుమయం గావించుకుందాం.



పొడవైన సముద్రతీరం సందర్శకులకు స్వర్గధామం

● రామనాథపురం జిల్లాలో అమలుకాని పర్యాటక పథకాలు


అరిచ్చల్‌మునై

టి.నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వ శాఖలు ప్రకటించిన విశిష్ట పథకాలను త్వరగా అమలు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలు అత్యధికంగా ఉన్న రామనాథపురం జిల్లాకు కోట్లాదిమంది పర్యాటకులు వస్తుంటారు. సముద్రతీర ప్రాంతాల్లో రామనాథపురం జిల్లా ప్రధాన పర్యాటక కేంద్రంగా ఉంది. రాష్ట్రంలో అత్యంత పొడవైన సముద్రతీర ప్రాంతం ఉన్న జిల్లాగా కూడా పేరుంది. రాష్ట్రంలో 1076 కి.మీ.లు వ్యాపించి ఉన్న సముద్రతీరంలో సుమారు 250 కి.మీ. తీర ప్రాంతం రామనాథపురంలోనే ఉంది. రాష్ట్రంలో మొత్తం 15 పక్షుల శరణాలయాలున్నాయి. వాటిలో చిత్తిరంకుడి, కాంజీరకుళం, మేల్‌సెల్వనూరు, కీళ్‌సెల్వనూరు, చక్రకోట్టై, తేర్తంగాళ్ అనే 5 పక్షుల శరణాలయాలు రామనాథపురం జిల్లాలోనే ఉన్నాయి. ఈ శరణాలయాల్లో విదేశీ వలస పక్షులు వస్తుంటాయి. దేశంలోనే మొట్టమొదటి సముద్రజీవుల సంరక్షణ కేంద్రంగా మన్నార్ జలసంధి పేరొందింది. ఇక రామేశ్వరం సుప్రసిద్ధ ఆధ్యాత్మికక్షేత్రంగా ప్రపంచ ప్రఖ్యాతిగడించింది. ఆ క్షేత్రానికి సమీపంలోనే ధనుష్కోడి, అరిచ్చల్‌మునై, రామేశ్వరం, పాంబన్, అరియమాన్, కురుచడైదీవి, కారంగాడు తదితర సముద్రతీర ప్రాంతాలను సందర్శించడానికి యేటా సగటున 4 కోట్ల మంది పర్యాటకులు వస్తున్నారు. ఇంతటి విశిష్టతలను సంతరించుకున్న రామనాథపురం జిల్లాలో పర్యాటక అభివృద్ధి పథకాలు పెద్దగా చేపట్టలేదు.


కురుచడై దీవి

హెలికాప్టర్ సర్వీసు...

గత యేడాది రాష్ట్ర బడ్జెట్‌లో రామేశ్వరం ప్రాంతానికి హెలికాప్టర్ సర్వీస్ పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు రామేశ్వరం - ధనుష్కోడి రహదారి ప్రాంతంలో హెలిపాడ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని మాత్రమే ఎంపిక చేశారు. ఆ తర్వాత హెలికాప్టర్ నడిపేందుకు ఎలాంటి ప్రక్రియ జరుగలేదు. ఇకనైనా రామనాథపురం జిల్లాకు ప్రభుత్వం ప్రకటించిన అన్నిరకాల పర్యాటకాభివృద్ధి పథకాలను వీలయినంత త్వరగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాగం చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు, రోజూ వేల సంఖ్యలో వచ్చే పర్యాటకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అమావాస్య రోజు వేల సంఖ్యలో ప్రజలు పిత్రు తర్పణాలు వదిలే ప్రాంతమైన అగ్నితీర్థం ప్రాంతం అపరిశుభ్రతకు ఆలవాలంగా మారింది. ఆ తీర్థాన్ని శుభ్రపరిచేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఆసక్తి చూపించడం లేదు. ధనుష్కోడి, అరిచ్చల్‌మునై ప్రాంతాలకు పర్యాటకులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం లేదు. రామేశ్వరంలోని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను పర్యాటకులు ఎలాంటి ఇబ్బందిలేకుండా సులువుగా సందర్శించడానికి రూ.80ల ఛార్జీతో ప్రభుత్వ రవాణా సంస్థ ప్రత్యేక టూరిస్టు బస్ సర్వీస్‌ను గత మార్చి 6న రవాణాశాఖ మంత్రి శివశంకర్ ప్రారంభించారు. ఆ టూరిస్టు బస్ సర్వీసు వల్ల తమ జీవనాధారానికి, సంపాదనకు గండిపడిందంటూ ఆటో నడిపేవారు, ప్రైవేటు వాహనాల యజమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో మరుసటి రోజే ఆ ప్రత్యేక టూరిస్టు బస్ నిలిపివేశారు. శాసనసభలో అటవీ శాఖ తరపున రామనాథపురంలో పర్యాట పర్యావరణ పర్యాటకాన్ని (ఎకో టూరిజమ్‌ను) రూ.15 కోట్లతో అభివృద్ధిపరచనున్నట్లు ప్రకటించడమే కాకుండా నిధులు కూడా కేటాయించారు. వీటిలో పగడపు దిబ్బల సంరక్షణ, పడవల సవారీ, పక్షుల సందర్శన కేంద్రం, తాబేళ్లపై అవగాహన కేంద్రం, సముద్రతీర ముఖద్వార ప్రాంతం అభివృద్ధి ఇలా పలు పథకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అయితే ఇప్పటిదాకా వీటిలో ఏ పథకమూ అమలుచేయలేదు.


మళ్ళీ పసుపు సంచులు: చెన్నైలో ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా గుడ్డసంచులను ఉపయోగించేలా కార్పొరేషన్ ఆధ్వర్యంలో అంబత్తూరు ఒటి మార్కెట్ వద్ద మూడు స్వచ్ఛంద సంస్థల సహకారంతో 'మళ్ళీ పసుపు సంచులు' పేరిట స్థానికులకు ఉచితంగా పసుపురంగు గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న మేయర్ ఆర్.ప్రియ.


కోయంబత్తూరులో ఇటీవల మృతి చెందిన డీఎంకే మాజీ ఎంపీ మోహన్ కుటుంబీకులను పరామర్శించి, ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

అల్లోపతి, ఆయుష్ అభ్యాసకుల సదస్సు

చెన్నై, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమగ్ర వైద్య పరిశోధనా కేంద్రం (సీఐఎంఆర్), బాలాజీ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ (ఎస్బీఎంసీహెచ్) సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ కే నారాయణసామి ప్రారంభించిన ఈ సదస్సులో ఆరోగ్యా హెల్త్‌కేర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.శివరామన్, ఎస్బీఈఎంసీహెచ్ డీన్ డాక్టర్ పి.శశికుమార్, సీఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ రత్తినం రాజా, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే ప్రభ తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాలు, వైద్య సంస్థలకు చెందిన సుమారు 450 మంది నిపుణులు ఈ సదస్సుకు హాజరయ్యారు.



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కిక్కిరిసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు




● కొత్త ధరల ఎఫెక్ట్

తిరుపతి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం నుంచి భూములు, ఆస్తుల విలువలు పెరగనున్న నేపథ్యంలో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలు క్రయ, విక్రయదారులతో కిక్కిరిసిపోతున్నాయి. జనవరి 1నుంచి ఆస్తుల విలువను పెంచేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. దీంతో డిసెంబరు నెలలోపు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో శుక్రవారం తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనుగోలుదారులు క్యూకట్టారు. ఒకదశలో సబ్ రిజిస్ట్రార్లకు ఊపిరితీసుకునే సమయం కూడా లేకపోవడంతో కొనుగోలుదారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసున్నాయి. శ్రీ బాలాజీ జిల్లాలో భూ విలువల పెంపుపై తిరుపతి అర్బన్ మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీ ఇప్పటికే సమావేశమైంది. మరో వారంలో జేసీ శుభం భన్సల్ అధ్యక్షతన కమిటీ సమావేశం కానుంది. రిజిస్ట్రేషన్ విభాగం ప్రతిపాదించిన ధరలను కమిటీ అంగీకారంతో పాటు ప్రజల నుంచి పెద్దఎత్తున అభ్యంతరాలు లేకపోతే కొత్త సంవత్సరంలో కొత్త ధరలు అందుబాటులోకి వస్తాయి.

అంబేడ్కర్ గురుకులాల్లో
మరమ్మతులకు రూ.90 లక్షలు

తిరుపతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిర్వహణ గ్రాంటు కింద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో మరమ్మతులు చేపట్టేందుకు తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ప్రభుత్వం రూ.90 లక్షలు మంజూరు చేసింది. పుత్తూరు గురుకులంలో తలుపులు, కిటికీల మరమ్మతులకు రూ.10 లక్షలు, చిల్లకూరు, వాకాడులో మరుగుదొడ్లు, మురుగునీటి కాలువల మరమ్మతులకు రూ.పదేసి లక్షల వంతున రూ.20 లక్షలు, నాయుడుపేటలో డార్మిటరీ రెండవ బ్లాక్, బ్లాక్ టూ తరగతి గది మరమ్మతులకు రూ.10 లక్షలు.. మొత్తం రూ. 40 లక్షలు మంజూరైంది. చిత్తూరు జిల్లాలో కుప్పం, చిత్తూరు, విజయపురం గురుకులాలకు రూ. 10 లక్షలు వంతున, రామకుప్పం గురుకులానికి రూ. 15 లక్షలు, పూతలపట్టు గురుకులానికి రూ.5 లక్షలు చొప్పున 50 లక్షలు మంజూరైంది.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1 లో 4కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.60 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,165

తలనీలాలు సమర్పించినవారు: 20,377



చీర.. భారతీయ సంప్రదాయ చిహ్నమే కాదు. ట్రెండీ కూడా. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు ఆడవాళ్లు చీరల మీద మోజు పడుతున్నారు. మనదేశంలో ప్రాంతాన్ని బట్టీ చీర కట్టులో తేడాలుంటాయి. తాజాగా తొడుక్కునే చీరలు మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. ఏ పెళ్లిలో అయినా చీరల తళుకులే ప్రత్యేక ఆకర్షణ. చీరంటే ఇప్పుడు.. ఒంటికి చుట్టుకునే వస్త్రం ఎంత మాత్రం కాదు. అందాన్ని పెంచే ఫ్యాషన్! అందుకే చీరలకూ ఒక ప్రత్యేక పండుగ దినాన్ని నిర్ణయించారు. దేశంలో ట్రెండీగా ఉన్న లేటెస్ట్ డిజైన్డ్ చీరలకు తిరుపతి జిల్లా కేంద్రంగా ఉంది. వెంకటగిరి కాటన్, నారాయణవనం పట్టు, కాళహస్తి కలంకారీ, మన్నారుపోలూరు సరిగ చీరలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ముంబై నగరాల్లో రెపరెపలాడుతున్నాయి. ఒకప్పుడు సంప్రదాయ చీరలకే పరిమితమైన ఈ ప్రాంతాలు మారుతున్న అభిరుచులకు అనుగుణంగా డిజైన్లు మార్చుకున్నాయి. తిరుపతి నగరంలో అయితే మగ్గం వర్క్ చీరలు హల్‌చల్ చేస్తున్నాయి.

కోక..మన కోక!





రాణులు మెచ్చిన
వెంకటగిరి చీర

ఒకప్పుడు రాణులకే పరిమితమైన వెంకటగిరి చీర ఇప్పుడు పేదలకూ అందుబాటులోకి వచ్చింది. నూరవ నెంబరు స్వచ్ఛమైన కాటన్ నూలుతో నేసే ఈ చీరకే దేశ విదేశాల్లో పేరుంది. క్రీ.శ. 1700 నుంచీ వెంకటగిరి చీర ప్రస్తావన పలు చోట్ల కనిపిస్తుంది. వెంకటగిరిని ఏలిన వెలుగోటి వంశస్థులు ఇక్కడి చేనేతను ప్రోత్సహించారు. పిఠాపురం, బొబ్బిలి ఆస్థానాలకు కూడా వెంకటగిరి చేనేత చీరలు వెళ్లేవి. వెంకటగిరి చీరకు 1999లో జీఐ గుర్తింపు కూడా లభించింది. నీతూ అంబానీ, ప్రసిద్ధ సినీతారలు మెచ్చే చీరలుగా వీటికి గుర్తింపు లభించింది. మేలైన నూలుతో నేసే చీరలు కావడం వల్ల వయసు మీరిన వారికి కూడా కట్టుకుంటే తేలికగా ఉండడం వెంకటగిరి చీరల ప్రత్యేకత. నిరంతరం కొత్త డిజైన్లు ఇక్కడ తయారవుతుంటాయి. ఆధునిక సాంకేతికత ఇందుకు ఉపయోగపడుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో వెంకటగిరి చీరలకు మంచి గిరాకీ ఉంది. ఏటా పదివేలకు పైగా చీరలు వెంకటగిరి మగ్గాల నుంచి తయారవుతున్నాయి. విభిన్నమైన డిజైన్‌లతో చీరలు నేసిన 11 మంది వెంకటగిరి నేత కళాకారులకు రాష్ట్రపతి అవార్డులు లభించడం విశేషం.

-వెంకటగిరిటౌన్, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

- జాంధాని వర్క్ చీరలు. చీరంతా డిజైన్ ఉండే వీటిని నేయడానికి వారంనుంచి నెల రోజులు కూడా పడుతుంది. వీటి ధరలు రూ. రెండు వేల నుంచి రెండు లక్షల దాకా ఉంటాయి.
- పూర్తి కాటన్ చీరలు రూ. 500 నుంచీ కూడా ఇక్కడ లభిస్తాయి.



నారాయణవనం
పట్టు స్టయిలే వేరు

చీరల్లోనూ పట్టుచీరల మీద ఉండే మోజు వేరే! అందుకే నారాయణవనం పట్టుచీరలకు అంత డిమాండ్. సింగిల్ త్రెడ్, డబుల్ త్రెడ్, వెండి జరీ, బంగారు జరీ చీరలను ఇక్కడ నేస్తారు.ఒకప్పుడు పూర్తిగా చేనేత చీరలే ఉండేవి. కాలక్రమంలో మరమగ్గాల మీద నేయడం మొదలు పెట్టారు. లతలూ పూలే కాకుండా దేవతా ప్రతిమల చిత్రాలతో కూడిన చీరలు నేయడం నారాయణవనం ప్రత్యేకత. ఈ చీరలు తక్కువ బరువు ఉండడంతో ఎక్కువ మంది ఇష్టపడతారు. ఇప్పటికీ 50 కుటుంబాలు వారసత్వంగా నారాయణవనంలో చీరల నేతనే వృత్తిగా కొనసాగించడం విశేషం. చెన్నై, బెంగులూరు, కంచిలకు నారాయణవనం చీరలు పంపుతారు.

- నారాయణవనం, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

- ఇమిటేట్ పట్టు మీద పోస్టర్ డిజైన్ చీరలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. చీరంతా డిజైన్ నిండి ఉండడం వీటి ప్రత్యేకత. వీటి ధరలు రూ. 5 వేల నుంచి 60 వేల దాకా ఉన్నాయి.
- నారాయణవనంలో నేసే ఇతర చీరలు డిజైన్‌ను బట్టీ రూ. 7500 నుంచి రెండు లక్షల దాకా ఉంటాయి.



ఎత్నిక్ ఫ్యాషన్ కాళహస్తి కలంకారీ

ఆలయకళగా ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి కలంకారీ.. ఇప్పుడు వస్త్ర ప్రపంచంలో లేటెస్ట్ ఫ్యాషన్‌గా మారింది. వయ్యారాల వొంపులు తిరిగే పూలూ, లతలతో కూడిన డిజైన్ చీరలకు డిమాండ్ ఎక్కువ. పౌరాణిక ఘట్టాలను రాసిన కలంకారీ చీరల కోసం సంపన్న మహిళలు పోటీ పడుతుంటారు. బ్లాక్ ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్‌తో ఉన్న కలంకారీ చీరలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నా శ్రీకాళహస్తి పెన్ కలంకారీకి ఉన్న డిమాండ్ తరగనిది. చేత్తో బొమ్మ గీసి, లతలూ పూల డిజైన్లు రాసి, వాటికి ఒక్కో దశలో ఒక్కో రంగు అద్దుతూ చేసే కళాత్మక ప్రక్రియ ఇది. చెట్ల ఆకులూ, వేర్లతో కూడిన సహజసిద్ధమైన రంగులే శ్రీకాళహస్తి కలంకారీ చీరలకు ఎక్కువగా వాడుతారు. శ్రీకాళహస్తిలో 35 కలంకారీ యూనిట్లు ఉన్నాయి. వందలాదిమందికి ఇవి ఉపాధి చూపుతున్నాయి. ఏటా శ్రీకాళహస్తి నుంచి 60 నుంచి 70వేల కలంకారీ చీరలు ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





లేటెస్ట్ ట్రెండ్

- జరీ అంచున్న కంచిపట్టు చీర మీద కలంకారీ డిజైన్ రాసిన చీరలకు ఇప్పుడు డిమాండ్ ఉంది. వీటి ధర రూ.20వేలనుంచి రూ.30వేల దాకా ఉంటుంది.
- టస్సర్, టిస్యూ, బెంగళూరు సిల్క్, చందేరి సిల్క్, మదనపల్లి పట్టు, మంగళగిరి సిల్క్, క్రేప్ క్లాత్, లెనిన్‌క్లాన్, కోట సిల్క్ చీరల మీద కలంకారీ డిజైన్లు ధరించేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. వీటి ధర రూ.10వేలు నుంచి రూ.20వేల వరకు ఉంది.

పోలూరు సరిగ చీరలు



సూళ్లూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు సరిగచీరలు ప్రత్యేకమైనవి. చేనేత నుంచి మరమగ్గాలకు ఎక్కువగా మారిపోయినా ఇప్పటికీ సంప్రదాయంగా ఇక్కడ చేనేత చీరలు కూడా తయారవుతున్నాయి. అయిదు రకాల చీరలు మన్నారుపోలూరులో నేస్తారు. పడగూ, పేకా కూడా పట్టు నూలు కలిగిన పూర్తి పట్టు చీరలు, కాటన్‌పై పాలిస్టర్ చీరలు, కాటన్‌పై పట్టు, జరీ బాండ్ చీరలు , సాధారణ కాటన్ చీరలు ఇక్కడ తయారవుతాయి. తరాలుగా ఇక్కడ వందలాది కుటుంబాలు చేనేతనే జీవనాధారం చేసుకున్నాయి. కంచి, ఆరణి లకు ఈ చీరలు పంపుతారు.

-సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

- మన్నారుపోలూరులో నేసే గ్రాఫికల్ డిజైన్ పట్టు చీరలను తాజాగా ఇష్టపడుతున్నారు. జరీ బార్డర్, బుటా, నిండు డిజైన్‌గల కొంగు.. ఈ చీరల ప్రత్యేకత. వీటి ధరలు రూ.1500 నుంచి 15 వేల దాకా ఉన్నాయి.





మగువలు మెచ్చే మగ్గం డిజైన్స్

నగరంలో ట్రెండ్ మగ్గం వర్క్ చీరలు. పెళ్లిళ్లలో ఇవే హైలెట్. కోరిన డిజైన్లను కోరిన రంగు మీద, నచ్చిన క్లాత్‌పై కుట్టించుకోవచ్చు. మెషీన్ ఎంబ్రాయిడరీ తోనూ ఇవి తయారవుతాయి కానీ, ధర ఎక్కువే అయినా చేతి పనికే డిమాండ్ ఎక్కువ. తిరుపతిలో 500 మగ్గం సెంటర్లు ఉన్నాయంటేనే ఈ రకం చీరలపై మహిళలకున్న మోజు ఎలాంటిదో అర్థం అవుతుంది. వివిధ రంగుల దారాలతో పాటూ చమ్కీలు, జరీ, అద్దాలు కూడా డెకరేటివ్‌గా కుడతారు. నెట్‌లో ఎంపిక చేసుకున్న డిజైన్ ఫోటోలు చూపి అలా కుట్టించుకునే సౌలభ్యం ఉండడం దీని ప్రత్యేకత.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

ఆన్‌లైన్ డిజైన్స్‌ను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. చీర వారే తెచ్చుకుంటారు. డిజైన్‌ను బట్టీ ఒక్కో చీరకు రూ. రెండు వేల నుంచీ ఇరవై వేల దాకా మగ్గం పనికే తీసుకుంటారు. ఈ చీరలు మార్కెట్‌లో లక్ష దాకా పలుకుతాయి.

ఘనంగా అమరరాజా 39వ వ్యవస్థాపక దినోత్సవం



రేణిగుంట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని అమరరాజా పరిశ్రమలో శుక్రవారం 39వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరరాజా సంస్థల ఛైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ.. 1985లో అమరరాజా పవర్ సిస్టమ్‌గా కార్యకలాపాలు ప్రారంభించిన గ్రూప్ ఇప్పుడు ఆరు కంపెనీలు, 17 వ్యాపారాలతో 18,500కుపైగా ఉద్యోగులను కలిగి ఉందన్నారు. అనంతరం ఎంపిక చేసిన ముగ్గురు గ్రామీణ పారిశ్రామికవేత్తలకు రూ.3లక్షల నగదు పురస్కారాన్ని అందించారు. అమర రాజాకు చెందిన మార్కెటింగ్ హెచ్‌ఆర్, ఫైనాన్స్, సప్లై చెయిన్ సీఎక్స్‌వోలకు సంవత్సరం మెంటార్‌షిప్ అందించారు. ఎంబీటీ తొలి అంతర్జాతీయ అంధ విద్యార్థి శ్రీకాంత్ బొల్లా తన స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అమరరాజా పరిశ్రమ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, డాక్టర్ రమాదేవి గౌరినేని, హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాదిత్య, సిద్ధార్థ గల్లా, గ్రూప్ ఆపరేషన్ హెడ్ నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మ్యారిటైమ్ బోర్డుకు 'పులికాట్' పనులు

తిరుపతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సు అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మ్యారిటైమ్ బోర్డుకు అప్పగించింది. జిల్లాలోని తడ, సూళ్ళూరుపేట, దొరవారిసత్రం, వాకాడు మండలాల పరిధిలో సరస్సు వున్న సంగతి తెలిసిందే. తమిళనాడు పరిధిలోని సరస్సులో సముద్ర ముఖ ద్వారాలకు తరచూ పూడిక తీస్తున్నారు. జిల్లా పరిధిలో మాత్రం గత ప్రభుత్వాలు విస్మరించడంతో ఇక్కడి సముద్ర ముఖద్వారాలన్నీ పూడిపోయాయి. సముద్రపు నీరు సరస్సులోకి రాకపోవడంతో సముద్ర రకాల చేపలు, రొయ్యలు, ఇతర రకాల మత్స్య సంపద ఇక్కడ అభివృద్ధి చెందడం లేదు. వీటిపై ఆధారపడ్డ మత్స్యకార కుటుంబాలు తమ పరిధి దాటి చేపల వేటకు వెళ్లాల్సి రావడంతో తరచూ తమిళనాడు జాలర్లతో సరిహద్దు తగాదాలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు సముద్ర ముఖద్వారాల పూడిక తీతకు రూ. 97 కోట్లు కేటాయించారు. వాకాడు మండలం పూడిరాయి దొరువు వద్ద చేపట్టాల్సిన ఈ పనులను ఏపీ మ్యారిటైమ్ బోర్డుకు అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆవిష్కరణలకు దిక్సూచిగా ఏపీ

● సీఐఐ రాష్ట్ర ఛైర్మన్ మురళీకృష్ణ ● వర్చువల్‌గా మాట్లాడిన సీఎస్ నీరబ్

తిరుపతి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలకు దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని సీఐఐ ఏపీ ఛైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ అన్నారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన సీఐఐ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఏపీ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో దార్శనిక నాయకులు, ఆవిష్కర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొని సుస్థిర వృద్ధికి ఉన్న అవకాశాలను అన్వేషించారు. ప్రారంభ సెషన్‌లో మురళీకృష్ణ స్వాగతోపన్యాసం చేస్తూ అభివృద్ధిని ప్రోత్సహించడానికి అపారమైన ప్రతిభ, వనరులను ఏపీ ఉపయోగించుకుంటుందన్నారు. అందరం కలిసి మరింత సమ్మిళిత, సృజనాత్మక, సుసంపన్న భవిష్యత్తుకు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వర్చువల్‌గా మాట్లాడారు. సరికొత్త ఆవిష్కరణలు అవసరమని, ఆదిశగా ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంసిద్ధతతో ఉన్నాయన్నారు. అరకువ్యాలీ నుంచి వస్తున్న అరబిక్ కాఫీ, ఇటీవల ఆవిష్కృతమైన సెలైన్ వాటర్ లాంథర్ గురించి ప్రస్తావించారు. ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ.. విజ్ఞాన ఆధారిత సహకారాలను సృష్టించడంలో ఉన్నత విద్యా సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో రెండు, మూడు కేంద్ర విద్యా సంస్థలు మాత్రమే ఉండగా నేడు చాలా వచ్చాయన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో స్టార్టప్ బిజినెస్ అభివృద్ధి కోసం ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. బలమైన ఎకోసిస్టమ్స్, స్టార్టప్‌లకు తిరుపతిలో ఉన్న ప్రయోజనాలను వివరించారు. తిరుపతిలో బలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి అందుబాటులో ఉన్న అనేక పథకాలను పరిశ్రమలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఐఐ తిరుపతి జోన్ ఛైర్మన్ పుష్పిత్ గార్గ్ మాట్లాడుతూ సృజనాత్మకత సంస్కృతిని పెంపొందించడం ద్వారా ఏపీలో సుస్థిర భవిష్యత్తును నిర్మించవచ్చన్నారు. సుస్థిరాభివృద్ధికి కేంద్రంగా మారడానికి తిరుపతికి అపారమైన సామర్థ్యం ఉందని సీఐఐ ఆంధ్రప్రదేశ్ మాజీ ఛైర్మన్ విజయ్ నాయుడు గల్లా వివరించారు. సుస్థిర అభివృద్ధికి తోడ్పడేందుకు ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్స్ అవసరాన్ని ఎస్ఆర్‌డీసీ సీనియర్ రీజినల్ మేనేజర్, డబ్ల్యూఐపీవో టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ హెడ్ డాక్టర్ బిజయ్ కుమార్ సాహూ స్పష్టం చేశారు. డిజిటల్ టెక్నాలజీ కన్సల్టెంట్, ఐటీటీ మాజీ రీజినల్ డైరెక్టర్ సునీల్ డేవిడ్ మాట్లాడుతూ కర్ణాటక తరహాలో ప్రతి రాష్ట్రానికి తమ బ్రాండ్ కాఫీని కస్టమైజ్ చేసినట్లుగా డైనమిక్స్ ఉన్నాయన్నారు. తిరుపతిలో 50కి పైగా ఐటీ కంపెనీలు, 10కి పైగా ఎమ్మెన్సీ కంపెనీలు ఉన్నాయని టెక్నాలజీ కంపెనీస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (టీసీవోఏపీ) అధ్యక్షుడు వంశీకృష్ణ రాయల్ తెలిపారు. తిరుపతికి ఉన్న ఉత్తమ అవకాశాల్లో శ్రీసిటీ ఒకటన్నారు. అనంతరం జరిగిన చర్చల్లో విద్య, వైద్యం, మార్కెటింగ్ వంటి రంగాలకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సందేహాలను ప్యానెల్ సభ్యులు నివృత్తి చేశారు.



రికార్డులు దహనంచేసి భూముల కబ్జా

● వైసీపీ పాలనలో అక్రమాలపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రేణిగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రెవెన్యూ రికార్డులను దహనంచేసి ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీంతో తమకు ఇష్టమొచ్చినట్లుగా ఆన్‌లైన్‌లో పేర్లు మార్చుకుని భూములు కాజేశారన్నారు. రేణిగుంట మండలం అన్నాస్వామిపల్లెలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నల్లకోటును అడ్డుపెట్టుకుని చేసిన భూదందాను వెలికి తీస్తామన్నారు. ప్రభుత్వ భూమిలో బంగ్లా నిర్మించుకుని నివాసం ఉండడాన్ని గుర్తించినట్లు తెలిపారు. సూరప్పకశం, కొత్రమంగళంలతోపాటు ఈ గ్రామంలోని సర్వే నెం. 385, 341/1, 342/3, 343/3, 338/1, 2, 334, 335లలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. అన్నాస్వామిపల్లెలో భూములను రీసర్వే చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. త్వరలోనే కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయాన్నీ వదల్లేదు

మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ముక్కంటి ఆలయాన్నీ వదలకుండా దోచుకున్నారని సుధీర్‌రెడ్డి విమర్శించారు. జగనన్న కాలనీల కోసం స్థలసేకరణలో అగ్రిమెంట్లు చేసుకుని కేవలం రూ.7లక్షలు వంతున రైతులకు చెల్లించి ప్రభుత్వం నుంచి రూ.45 కోట్లు కొట్టేశారన్నారు. శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాల తొలగింపులో కనిపించని మాజీ ఎమ్మెల్యే.. స్వర్ణముఖి నది ఒడ్డున ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులను అడ్డుకోవడంలో అంతర్యమేమిటో చెప్పాలన్నారు. వైసీపీ పాలనలో కొంత మంది రేణిగుంట పరిసరాల్లో ఆక్రమిత భూముల్లో ప్లాట్లు వేసి విక్రయించారన్నారు. ఇలాంటి ప్లాట్లు కొనవద్దని తాను అప్పట్లో చెప్పానని గుర్తుచేశారు. ఎవరైనా వీటిని కొని నష్టపోతే అందుకు వైసీపీ నాయకులే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, తహసీల్దారు సురేష్ బాబు, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



2018కి ముందు, తర్వాత కబ్జా భూముల్లో తేడాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

పోక్సో కేసులో నలుగురికి పదేళ్ల జైలు

నెల్లూరు (లీగల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను ప్రేమించానని నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తితోపాటు అందుకు సహకరించిన మరో ముగ్గురికి పదేళ్ల జైలు శిక్ష, రూ.22 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు...ఓజిలి మండలం ఇనగుంట గ్రామానికి చెందిన దండోలు సుబ్బారావు అలియాస్ సుబ్బు 10వ తరగతి చదువుతున్న ఓ బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడికి బుచ్చినాయుడు కండ్రిగ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన కోగిలి సుబ్రహ్మణ్యం, ఓజిలి మండలం ఇనగుంట గ్రామానికి చెందిన ఎల్లంటి వెంకటయ్య, బాలాయపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన మంగుళూరు వాణి సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓజిలి పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులు ఒక్కొక్కరికి పదేళ్ల జైలు శిక్ష, 22 వేల రూపాయల వంతున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.



చెన్నై వేప్పేరిలో శుక్రవారం ఉదయం ఆకస్మికంగా కూలిపడిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్‌ఎన్ రవిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న బ్రిటిష్ డిప్యూటీ రాయబారి హలిమా హోలండ్